
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
నల్లగొండ
ఆదివారం 10 ఆగస్టు 2025



**** గరిష్ఠం 30.5 కనిష్ఠం 22.4

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.70 (311.1486)	44,647	44,647
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.10 (4.02)	4,360	9,918
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.3237 (41.7627)	51,409	51,409

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు లైవ్ : రూ.125 డ్రెస్ : రూ.190 స్కిన్‌లెస్ : రూ.220



బీసీ కోటా పెరగడం పక్కా!

స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబరు నెలాఖరులోగా పూర్తిచేసే ఉద్దేశంతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో స్పష్టతకు వస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. అధికారికంగా 42శాతం బీసీ రిజర్వేషన్లకు ఆమోద ముద్ర లభించకపోవడంతో పార్టీపరంగా ఆ వర్గాలకు సీట్లు కేటాయించేలా అధికార కాంగ్రెస్ యోచిస్తోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

▸ రిజర్వేషన్లు అధికారికమా? పార్టీపరమా? ▸ కొనసాగుతున్న ఉత్కంఠ ▸ కాంగ్రెస్ నుంచి 42శాతం ఇస్తామంటున్న నేతలు

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఆర్డినెన్స్‌కు రాష్ట్రపతి ఆమోదముద్ర లభించకపోగా, అందు కోసం చేసిన ప్రయత్నాలు సఫలీకృతం కాలేదు. దీంతో పార్టీపరంగా 42శాతం బీసీలకు టికెట్లు ఇచ్చి తీరుతామని సీఎం రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలు ప్రకటిస్తున్నారు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు గత రిజర్వేషన్ 23శాతం కొనసాగిస్తూ, మిగిలిన 19శాతం మేర, లేదా అంతకుమించి జనరల్ స్థానాల్లో బీసీ అభ్యర్థులను నెలబెట్టాలనేది కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తుండగా, ప్రతిపక్షాల వ్యూహం తేలాల్సి ఉంది. చివరిసారిగా 2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ పదవుల్లో బీసీలు జనరల్ స్థానాల్లోనూ గణనీయంగా గెలుపొందారు. అయితే జడ్పీపీఠాలు మాత్రం జనరల్ కోటాలో దక్కించుకోలేకపోయారు. ఇప్పుడు సైతం ఎంపీపీ, జడ్పీ చైర్మన్ పదవులకు కూడా జనరల్ స్థానాల్లో బీసీలకు అవకాశమిచ్చేలా టిక్కెట్లు ఇస్తేనే ఆ వర్గానికి తగిన స్థానం దక్కుతుందని బీసీ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.

అధికార, ప్రతిపక్షాలు చిత్తశుద్ధితో వ్యవహరిస్తేనే

స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబరులో నిర్వహిస్తారని భావిస్తుండగా, పంచాయతీ, పరిషత్ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో బీసీ అభ్యర్థులకు అవకాశమివ్వాలని బీసీ సంఘాల నాయకులు కోరుతున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు చిత్తశుద్ధితో వ్యవహరిస్తేనే బీసీలకు ఆయా సీట్లు దక్కుతాయని, లేదంటే రాజకీయక్రీడగా సీట్ల కేటాయింపు కొనసాగితే జనరల్ స్థానాల్లో సీట్ల కేటాయింపు కంటితుడుపు చర్యగా మిగులుతుందని బీసీ సంఘాలనాయకులు అభిప్రాయపడుతున్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాల్లో అధికార పార్టీ ఏ జనరల్ స్థానంలో బీసీలకు టికెట్ కేటాయిస్తే, ప్రతిపక్షాలు సైతం అవే స్థానాల్లో టికెట్లు ఇస్తేనే అంతిమంగా బీసీల ప్రాతినిధ్యం పెరుగుతుందంటున్నారు. అలా కాకుండా గెలుపు లక్ష్యంగానో, లేక స్థానిక పరిస్థితుల పేరుతో ఒక పార్టీ బీసీ అభ్యర్థిని నిలబెట్టిన చోట, మరో పార్టీ జనరల్ అభ్యర్థిని లేదా, ఇతర బలమైన ఓటు బ్యాంకు ఉన్న సామాజికవర్గాలకు టికెట్ ఇస్తే అలాంటి చోట్ల బీసీ అభ్యర్థులు గెలుపును అందుకోలేని పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు. అధికార, ప్రతిపక్షాలకు బీసీలకు అవకాశాలు పెంచాలనే చిత్తశుద్ధి ఉంటే జనరల్ సీట్లలో బీసీలకు ఇచ్చే సీట్లలో అన్ని పార్టీలు ఆ వర్గాలకే టికెట్ ఇవ్వాలనే డిమాండ్ సంఘాల నుంచి వస్తోంది.

గత ఎన్నికల్లో జనరల్ సీట్లలోనూ భారీ గెలుపు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2019లో జరిగిన పంచాయతీరాజ్ ఎన్నికల్లో అధికారికంగా 23శాతం రిజర్వేషన్ ఉండగా, అధికారిక రిజర్వేషన్ కోటా దాటి జనరల్ స్థానాల్లోనూ బీసీ అభ్యర్థులు విజయఢంకా మోగించారు

మిగతా 6వ పేజీలో...

పంచాయతీల్లో గెలుపొందిన బీసీలు ఇలా..

	నల్లగొండ	సూర్యాపేట	యాదాద్రి	మొత్తం
పంచాయతీల సంఖ్య	835	475	420	1730
బీసీ రిజర్వ్‌డ్ స్థానాలు	209	171	117	497
జనరల్‌లో గెలిచిన బీసీలు	79	52	59	190
మొత్తం బీసీలు గెలిచినవి	288	223	176	687
ఎంపీటీసీ స్థానాల్లో గెలుపొందిన బీసీలు ఇలా..				
ఎంపీటీసీ స్థానాలు	346	255	117	718
బీసీ రిజర్వ్‌డ్ స్థానాలు	93	29	39	161
జనరల్‌లో గెలిచిన బీసీలు	28	50	12	90
మొత్తం బీసీలు గెలిచినవి	121	79	51	251
జడ్పీటీసీ స్థానాల్లో గెలుపొందిన బీసీలు ఇలా..				
జడ్పీటీసీ స్థానాలు	31	23	17	71
బీసీ రిజర్వ్‌డ్ స్థానాలు	4	3	4	11
జనరల్‌లో గెలిచిన బీసీలు	4	2	1	7
మొత్తం బీసీలు గెలిచినవి	8	5	5	18



రైతు బీమాకు వేళాయే

▸ 14 నుంచి రెన్యూవల్ ▸ కొత్తవారు 13లోగా దరఖాస్తుకు అవకాశం ▸ మార్గదర్శకాలు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

రైతు కుటుంబాలకు బీమా కల్పించేందుకు ప్రభుత్వం రైతు బీమాను అమలుచేస్తోంది. ఈనెల 13వ తేదీన రైతు బీమా పథకం ముగుస్తున్న నేపథ్యంలో 14 నుంచి బీమా పథకాన్ని రెన్యూవల్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. కొత్త పాస్ పుస్తకం పొందిన రైతులు ఈనెల 13లోగా దరఖాస్తు చేసుకోవాలి. గతంలో ఈ పథకం పరిధిలో ఉన్నవారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. గతంలో ఈ స్కీంలో ఉన్న వారందరి డేటాను యథవాధిగా పునరుద్ధరించనున్నారు. ఈ పథకం కింద పేరు నమోదైన రైతు ఏ కారణంతో మృతి చెందినా అతడి నామినీకి రూ.5లక్షలను 10రోజుల్లోనే బీమా కంపెనీలు అందజేస్తాయి.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

గత ప్రభుత్వంతో పాటు ప్రస్తుత ప్రభుత్వంలో ఎనిమిదో సారి ఈ పథకం అమలుకానుంది. 18 నుంచి 59 ఏళ్ల వయసు ఉన్న రైతులు దరఖాస్తులు చేసుకోవాలి. పుట్టిన తేదీని కచ్చితంగా ఆధార్ ప్రకారం నమోదు చేయాలి. గత సంవత్సరంలో రైతుబీమా నమోదు చేసుకున్న రైతులు వారి నామినీ ఏదైనా కారణంతో మృతిచెందినా కొత్త నామినీలను నమోదుచేసే అవకాశం ఉంటుంది. కొత్త నామినీ ఆధార్‌తో పాటు బ్యాంకు వివరాలను వ్యవసాయ అధికారులకు అందించాలి.

ఉమ్మడి జిల్లాలో 5.70లక్షల మందికి బీమా

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే సుమారు 5,70,825మందికి పైగా రైతులకు రైతుబీమా పథకం అమలవుతోంది. ఈ పథకంలో పేరు నమోదుచేసుకున్న రైతులు దురదృష్టవశాత్తు మృతిచెందితే వారి కుటుంబం వీధిన పడకుండా ఉండేదుకు ఈ పథకం దోహదపడనుంది. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఈ పథకంలో నల్లగొండ జిల్లాలో 2,85,828మంది రైతులు ఉండగా, సూర్యాపేట జిల్లాలో 1.60లక్షలు, యాదాద్రి జిల్లాలో 1.25 లక్షల మంది నమోదై ఉన్నారు. కొత్తగా పాస్ పుస్తకాలు పొందిన రైతులు నల్లగొండ జిల్లాలో 20,243ఉండగా, సూర్యాపేట జిల్లాలో 12 వేలకు పైచిలుకు, యాదాద్రి జిల్లాలో

- మిగతా 6వ పేజీలో...


నేడు మళ్లీ తెరుచుకోనున్న సాగర్ గేట్లు

● ఈ ఏడాది రెండోసారి ● 589.70 అడుగుల వద్ద నీటిమట్టం

● మూసీ ఐదు గేట్ల నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

7

నిండుకుండలా ఉన్న సాగర్ జలాశయం



పెరిగిన బస్ టికెట్ ధరలు

లబోదిబోమంటున్న ప్రయాణికులు

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం సందర్భంగా ఉద్యోగులకు చాలెంజ్ విసిరిన ఆర్టీసీ, రాఖీ పండుగకు ప్రయాణికులపై భారం మోపింది. రాత్రికి రాత్రే బస్ టికెట్ ధరలను పెంచేసింది. మిర్యాలగూడ నుంచి సాధారణ రోజుల్లో డీలక్స్ బస్ టికెట్ ధర రూ.290 ఉండగా, రాఖీ స్పెషల్ టికెట్ ధరను రూ.430కి పెంచింది.

ప్రయాణికులపై ఆర్థికభారం

పండుగ సీజన్లు, ప్రత్యేక కార్యక్రమాల సమయంలో భారం మోపడం ఆర్టీసీకి పరిపాటిగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. పండుగల వేళ అదనపు బస్సులు, ప్రత్యేక ఆఫర్లు ఇవ్వాల్సిన ప్రభుత్వరంగ సంస్థ అదునుచూసి అదరగొట్టడమనే విధంగా చార్జీలు పెంచడం సరికాదంటున్నాయి ప్రజాసంఘాలు. మహిళలకు మహాలక్ష్మీ పథకం ద్వారా ఉచిత రవాణా కల్పిస్తూ, వృద్ధులకు రాయితీ అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించిన ఆర్టీసీ, రాఖీ పండుగ సందర్భంగా 50శాతం చార్జీలు పెంచడం తగదంటున్నారు.



మిర్యాలగూడ - హైదరాబాద్ టికెట్

ఉన్నతాధికారుల ఆదేశాలంటూ..

ప్రజారవాణా సంస్థయిన ఆర్టీసీ సంస్థ అధికారులు, ఉద్యోగులకు స్పష్టమైన లక్ష్యం ఇస్తోంది. ఈ పండుగకు ఇంత వసూలు చేయాలి, ఇంత కలెక్షన్ రావాలంటూ ప్రైవేటు సంస్థలా హుకూం జారీ చేస్తోందని ఉద్యోగులు వాపోతున్నారు. సాధారణ, అద్దె బస్సులకు స్పెషల్ సర్వీసులంటూ, మహాలక్ష్మీ పథకం వర్తించదంటూ స్టిక్కర్లు వేస్తున్నారు. అమాంతం పెంచిన అదనపు చార్జీలను వసూలు చేస్తూ పండుగ పూట ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్నారని నెటిజన్ల పోస్టులు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

ప్రతీ పండుగకు పెంచడం సరికాదు



దసరా, సంక్రాంతి పండుగల సందర్భంగా టికెట్ ధరలు పెంచడం తెలిసిందే. అలా అని ప్రతీ పండుగకు టికెట్ ధరలు పెంచడం సరికాదు. పరిస్థితి చూస్తుంటే కృష్ణాష్టమి, వినాయక చవితి పండుగలకూ టికెట్ ధర పెంచేలా ఉంది ఆర్టీసీ.

- అజయ్ నేరెళ్ల, మిర్యాలగూడ

ప్రయాణికులను దోచుకోవద్దు



పండుగల పేరుతో ప్రయాణికులను దోచుకోవడం సరికాదు. ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని 30నుంచి 40శాతం టికెట్ ధరలు పెంచి ప్రయాణికుల జేబులు గుల్ల చేస్తున్నారు. ఆదాయ పెంపు కోసం ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలి. ప్రజా రవాణా సేవలు వినియోగించుకునే వారిలో పేద, మధ్యతరగతి వారే అధికంగా ఉంటారు. టికెట్ ధరలు అమాంతంగా పెంచి సామాన్య ప్రజలను ఇబ్బంది పెట్టడం తగదు.

- జాజుల లింగంగౌడ్, బీసీ సంఘ రాష్ట్ర కార్యదర్శి, మిర్యాలగూడ

రైళ్లు ఆగుతున్నాయి

▸ ఆన్‌లైన్ టికెట్ బుకింగ్‌లో కనిపించని స్టేషన్ల పేర్లు

▸ గడువు ముగియడంతో ఎత్తేశారనుకుంటున్న ప్రయాణికులు



మిర్యాలగూడ రైల్వే స్టేషన్

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో తీసుకున్న నిర్ణయం రైల్వే ప్రయాణికులపై ప్రభావం చూపుతోంది. వైరస్ వ్యాప్తి చెందకుండా ప్రయాణికులను కట్టడి చేసే క్రమంలో రైల్వేశాఖ తీసుకున్న నిర్ణయంతో దేశవ్యాప్తంగా పలు స్టేషన్లలో రైళ్ల హాల్ట్‌లను ఎత్తేశారు. అందులో భాగంగా పలు రైళ్లకు మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల స్టేషన్లలో హాల్ట్‌లను తొలగించారు. అయితే ప్రయాణికుల ఆందోళన, ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు ఆయా స్టేషన్లలో పరిమిత కాలానికి మాత్రమే స్టాప్‌లను పునరుద్ధరించారు. ఆరు నెలలకోసారి జరుగుతున్న రైళ్ల హాల్ట్‌ల పునరుద్ధరణ ప్రక్రియ జూలై 18వ తేదీ నాటికి పూర్తయింది.

ఆన్‌లైన్‌లో చూపించకపోవడంతో..

నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్, చెన్నై సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లలో ప్రయాణించేందుకు ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకునే క్రమంలో రిటర్న్ జర్నీలో నడికుడి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ స్టేషన్లు కనిపించకపోవడంతో ఆయా స్టేషన్లలో స్టాప్‌లను గతంలో మాదిరిగా ఎత్తివేశారన్న ప్రచారం జరిగింది. విశాఖ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌కు అయితే నడికుడి, పిడుగురాళ్ల, మిర్యాలగూడలతో పాటు నల్లగొండ స్టేషన్ సైతం ఆన్‌లైన్ టికెట్ బుకింగ్‌లో చూపించడం లేదని, గుంటూరు తదుపరి సికింద్రాబాద్(లింగంపల్లి) మాత్రమే చూపుతోందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాకపోకలు యథాతథంగానే..

నల్లగొండ, మిర్యాలగూడ మీదుగా పరుగులెట్టే రైళ్ల రాకపోకల్లో మార్పులేవీ లేవని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు. ప్రతీ ఆరు నెలలకోసారి ప్రయోగాత్మకంగా స్టాపులను ఎత్తేసేలా ఉత్తర్వులు జారీ అయినా, రైళ్ల రాకపోకల్లో ఎటువంటి మార్పులు, చేర్పులు లేవంటున్నారు. ఎక్స్‌పర్మెంటల్ స్టాపేజెస్ ప్రక్రియలో భాగంగా పేర్కొన్న విధంగా టికెట్ బుకింగ్ సైట్‌లో ఆయా స్టేషన్లు కనిపించడం లేదంటున్నారు. నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్, చెన్నై సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో టికెట్ బుక్ చేసుకునే క్రమంలో రిటర్న్ జర్నీలో నడికుడి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ స్టేషన్లు కనిపించకపోగా, విశాఖ ఎక్స్‌ప్రెస్ టికెట్ బుకింగ్ రిజర్వేషన్లలో ఈ మూడు స్టేషన్లతో పాటు నల్లగొండ స్టేషన్ పేరు కనిపించడం లేదన్న ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. విషయాన్ని ఉన్నతాధికారులకు, సాంకేతిక విభాగానికి తెలియజేశామని, ప్రయాణికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రైల్వే అధికారులు తెలిపారు.

అన్ని చెరువులు, కుంటలు నింపుతాం

నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం

కట్టంగూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని చెరువులను, కుంటలను నింపుతామని తద్వారా భూగర్భ జలాలు పెరిగి రైతులు ఆనందగా ఉంటారని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శనివారం మండలంలోని అయిటిపాముల రిజర్వాయర్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అయిటిపాముల రిజర్వాయర్ ద్వారా నీటి విడుదల చేశామని, ఈ నీటితో కేతేపల్లి మండలంలోని కొండకిందిగూడెం, బండపాలెం, ఇనుపాముల, కొర్లపహాడ్‌లతో పాటు నకిరేకల్ మండలంలోని నకిరేకల్, నోముల గ్రామాల్లోని చెరువులు నిండుతాయన్నారు. కాళేశ్వర ప్రాజెక్టును బీఆర్ఎస్ హయాంలోనే కట్టారని, వారి హయాంలోనే కూలిందన్నారు. కాళేశ్వరం ద్వారా ఎన్ని టీఎంసీల నీరు ఎత్తారు? అని ఎన్ని ఎకరాలకు నీరు ఇచ్చారు? అని ఆయన ప్రశ్నించారు. గత పాలకుల తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని విధ్వంసం చేసి అప్పులపాలు చేశారు తప్ప అభివృద్ధి జరగలేదన్నారు. రైతుల కళ్లలో ఆనందం చూడటమే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, మాజీ జడ్పీటీసీలు మాద యాదగిరి, సుంకరబోయిన నర్సింహ, నాయకులు నంద్యాల వెంకట్‌రెడ్డి, బెజవాడ సైదులు, ఎడ్ల పెద్దరాములు, రెడ్డిపల్లి సాగర్, చెనగోని సాయిలు, కొండయ్య, మర్రి రాజు, మిట్టపల్లి శివ, చెనగోని రవి, తదితరులు ఉన్నారు.



అయిటిపాముల రిజర్వాయర్ వద్ద గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

విద్యాసంస్థల్లో సైకాలజిస్ట్‌లను నియమించాలి

మిర్యాలగూడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యాసంస్థలన్నింటిలో సైకాలజిస్ట్‌లను నియమించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు కోరారు. శనివారం ఈ మేరకు ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల పాఠశాల స్థాయి నుంచే మానసిక ఒత్తిడి, ఆందోళనలకు గురవుతున్న విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. అలాంటి వాతావారణం నుంచి విద్యార్థులను బయటపడవేసి సానుకూల దృక్పథాన్ని కలిగించి భవిష్యత్‌పై ఆశలు పెంచే విధంగా సైకాలజిస్టులను విద్యాసంస్థల్లో నియమించాలని కోరారు. సరైన సమయంలో విద్యార్థులకు, యువతకు కౌన్సిలింగ్ ఇవ్వడం వల్ల సమగ్రమైన మానసిక, నైతిక సామాజిక ప్రవర్తనలో మార్పులు తీసుకురావచ్చునని అన్నారు. విద్యాసంస్థల్లో విధిగా సైకాలజిస్టులను నియామకం చేయాలని ఇటీవల సుప్రీంకోర్టు కూడా తీర్పునిచ్చిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని నియామకాలు చేపట్టేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఎమ్మెల్సీకి అందజేసిన వినతిపత్రంలో కోరినట్లు చెప్పారు. వినతిపత్రం అందజేసిన వారిలో సైకాలజిస్ట్ కర్లం లింగయ్య, తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న సైకాలజిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

బూత్ స్థాయి నుంచే కాంగ్రెస్‌ను పటిష్ఠం చేయాలి



యువజన కాంగ్రెస్ జెండాను ఆవిష్కరిస్తున్న గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బూత్ స్థాయి నుంచే యువజన కాంగ్రెస్‌ను పటిష్ఠం చేయాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి అన్నారు. యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువజన కాంగ్రెస్ కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. క్రమ శిక్షణతో పని చేసే వారికి మంచి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యకర్తలు ఎదగడానికి యువజన కాంగ్రెస్ పునాది లాంటిదని అన్నారు. చిత్తశుద్ధితో పనిచేసే వారికి పార్టీ పరంగా పదవులు వరిస్తాయని, పార్టీ ఏ కార్యక్రమం ఇచ్చినా యువజన కాంగ్రెస్ క్రియాశీలక పాత్ర పోషించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నల్లగొండ నియోజకవర్గ అధ్యక్షుడు మామిడి కార్తీక్, నాయకులు కత్తుల కోటి, జహంగీర్, నారాజు, సతీష్, ఆనంద్‌రెడ్డి, నవీన్, అనిల్, సిద్దార్థ, రంజిత్, జానీ, సురేష్, అజారుద్దీన్, ముజ్జు, విజయ్, పరుశరాం, వసీం, వినయ్, హలీం, బిలాల్, జానకీరామ్, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి

నల్లగొండ కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రావాల్సిన పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని పెన్షనర్ల భవనంలో జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్లకు రావాల్సిన ఐదు డీఏలను వెంటనే విడుదల చేసి, ఈహెచ్ఎస్ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈనెల 11న ఉదయం 11 గంటలకు హైదరాబాద్ మెడ్‌విజన్ కంటి ఆస్పత్రి సహకారంతో పెన్షనర్స్ భవనంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నామన్నారు. దీన్ని పెన్షనర్స్ కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ చేస్తారన్నారు. అనంతరం 30 మంది పెన్షనర్ల జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్, నాయకులు జిల్లా శ్రీశైలం, రామలింగం, గోపాల్‌రెడ్డి, రవి ప్రసాద్‌రావ్, కేశవాచారి, మహేశ్వరి, భిక్షం, ఆంజనేయులు, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్‌లో ఆల్‌రౌండర్

బంతి విసిరాడో వికెట్ పడవలసిందే •

ఉద్యోగం చేస్తునే అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న వెంకటేశ్వర్లు •

డిండి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి):నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన బొల్లెపల్లి వెంకటేశ్వర్లు క్రికెట్‌లో రాణిస్తున్నాడు. 2023-24 సంవత్సరంలో ఇంటర్ పూర్తి 2024లో డిండి మండలంలోని వావిల్‌కోల్ గ్రామంలో అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టుమాస్టర్‌గా ఉద్యోగంలో చేరాడు. ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లో స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడేవాడు. తన మిత్రుడు మణి ద్వారా క్రికెట్‌లో మెళకు వలను నేర్చుకొని ప్రతిభకు పదును పెట్టాడు. పది సంవత్సరాల వయస్సులోనే తల్లి సుజాత, తండ్రి వీరయ్య చనిపోవడంతో తన అమ్మమ్మ వద్ద పెరిగాడు. బాల్యం నుంచి క్రికెట్‌పై ఆసక్తి పెంచుకొని క్రికెట్ ప్రాక్టీస్ చేశాడు. రాష్ట్రస్థాయిలో అండర్-19 విభాగంలో ఆడి ఆల్‌రౌండర్‌గా రాణించాడు. అండర్-19 విభాగంలో అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ ఆడేందుకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో జూలై 11న ఆలిండియా ఇన్‌క్లోజూవ్ ఫెడరేషన్ ఆఫ్ స్పోర్ట్స్ అకాడమీ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు తెలుసుకొని వెళ్లాడు. సెలక్షన్‌లో వెంకటేశ్వర్లు కనబర్చిన ప్రతిభను చూసిన సెలక్షన్ కమిటీ ఇండోనేపాల్ టీ20 క్రికెట్ ఫెడరేషన్ కప్ 2025 జట్టులో స్థానం కల్పించింది. గత నెల 20వ తేదీ నుంచి 24వరకు నేపాల్‌లోని కోఖారాలో జరిగిన టీ20 క్రికెట్ ఫెడరేషన్ కప్ మూడు సిరీస్‌ల్లో భారత జట్టు ప్రతిభకనబర్చి కప్ సాధించింది. ఈ సిరీస్‌లో వెంకటేష్ ఆల్‌రౌండర్‌గా రాణించాడు.



ఇండోనేపాల్‌లో జరిగిన టీ20లో సాధించిన క్రికెట్ ఫెడరేషన్‌కప్‌తో వెంకటేష్

దైవత్వం.. విగ్రహాల దాతృత్వం

» కంఠమహేశ్వర స్వామి ఆలయాలకు విగ్రహాల అందజేత

» ఇప్పటివరకు 216 విగ్రహాలు అందజేసిన నారగోని నీరజ శంకర్

దైవత్వంతో విగ్రహాల దాతృత్వానికి శ్రీకారం చుట్టారు నీరజ, శంకర్ దంపతులు. తల్లిదండ్రుల సూచనతో వందల విగ్రహాలను దానం చేస్తూ దాతృత్వంలో ముందుంటున్నారు. ఆధ్యాత్మిక చింతన మెండుగా భార్యాభర్తలు సమాజ సేవతో ముందుకెళ్తున్నారు. భర్త పోలీస్ అధికారి కాగా, ఆమె ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. తాము సంపాదించిన దానిలో కొంత భాగాన్ని దైవత్వానికి ఖర్చు చేస్తున్నారు. దైవత్వంలో దాతృత్వాన్ని చాటుతున్నారు.

\- ఆంధ్రజ్యోతి, హుజూర్‌నగర్

నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం సూరారం గ్రామానికి చెందిన నారగోని శంకర్, నీరజ దంపతులు 30 ఏళ్ల క్రితం ఉద్యోగరీత్యా సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు వచ్చి స్థిరపడ్డారు. శంకర్ ఏఎస్‌ఐగా పనిచేస్తూ ఇటీవల స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. నీరజ చిలుకూరు మండలం నారాయణపురంలో వెట్నరీ జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా కంఠమహేశ్వరస్వామి దేవాలయం నిర్మించినా ఆ ఆలయాలకు విగ్రహాలను అందజేస్తున్నారు. 20 సంవత్సరాలుగా రెండు రాష్ట్రాల్లోని నల్లగొండ, దేవరకొండ, తెనాలి, కృష్ణా జిల్లా, సూర్యాపేట జిల్లా, ఖమ్మం, వైరా, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో ఇప్పటివరకు 216 కంఠమహేశ్వరస్వామి ఆలయాల్లో ప్రతిష్ఠించే మూల విరాటాలను బహూకరించారు. బూరుగడ్డ, కుతుబాషాపురం, బక్కవంతలగూడెం, మఠంపల్లి, శ్రీనివాసపురం, వెల్లటూరు కాలనీ, మల్లారెడ్డి గూడెం, మూసిబడ్డు సింగారం, చిలుకూరు, కీతవారిగూడెం, పాలారం, గ్రామాల్లో విగ్రహాలు అందజేశారు. ఒక దేవాలయంలో కంఠమహేశ్వరస్వామి, సూరమాంబ, కౌండిన్య మహముని, పోతురాజులు, వనమైసమ్మ, వన ఎల్లమ్మ, నందీశ్వరుడు, శివలింగం, పానవఠం, కలకోడిపుంజు లాంటి తొమ్మిది విగ్రహాలు కలిపి సుమారు రూ. 1.50లక్షలు ఖర్చు చేసి ఆలయాలకు అందజేశారు. 30 ఏళ్ల క్రితం శంకర్ తల్లిదండ్రులు రాళ్లకు పూజలు చేస్తుండగా గౌడ కులస్థుల ఆరాధ్య దైవమైన కంఠమహేశ్వరుడి చరిత్రను తెలుసుకొని విగ్రహాలను దానం చేయాలని నిర్ణయించుకున్నారు. ఏ ఊరిలోనైనా గీత కార్మికులు ఆలయం కడుతున్నామని వచ్చి అడిగితే లేదనకుండా విగ్రహాలు అందజేస్తున్నారు.



విగ్రహాలు అందజేసిన నారగోని నీరజ శంకర్



కంఠమహేశ్వర విగ్రహాలు అందిస్తాం



తెలుగు రాష్ట్రాల్లో భక్తులు కంఠమహేశ్వర స్వామి ఆలయాలు ఎక్కడ నిర్మించినా విగ్రహాలు అందిస్తాం. 20 ఏళ్లలో 216 విగ్రహాలను అందజేశాం. చిన్నప్పుడు తన తల్లిదండ్రులు చెప్పిన విధంగా తనకు వచ్చిన ఆదాయంలో కొంతభాగాన్ని దైవత్వానికి అందజేస్తున్నాం. కుటుంబ సభ్యులు సహకారంతోనే ఆధ్యాత్మికతకు ప్రాధాన్యం ఇస్తున్నాం.

\- నారగోని నీరజశంకర్, హుజూర్‌నగర్

ఆకృతి, ఆరోగ్యానికి వ్యాయామం

• చిన్న పట్టణాలకు విస్తరిస్తున్న జిమ్‌లు • ఆసక్తి చూపుతున్న యువత



వీ.టీ.నగర్ జిమ్‌లో సాధన చేస్తున్న యువకులు

(ఆంధ్రజ్యోతి-చింతపల్లి)

కరోనా తరవాత యువత ఆలోచనల్లో మార్పు వచ్చింది. ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. దీంతో అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకొని ఆరోగ్య పరిరక్షణ, శారీరక ధృఢత్వాన్ని పెంచుకోవడంపై యువత ఆసక్తి చూపుతున్నారు. శరీర సౌష్టవాన్ని అందంగా తీర్చిదిద్దుకొని ఆకర్షణంగా ఉండటానికి నిత్యం యువకులు వ్యాయామం చేస్తున్నారు. ఇందుకు జిమ్‌లు తోడ్పాటు అందిస్తున్నాయి. ఒకప్పుడు నగరాలు, పట్టణాలకే పరిమితమైన జిమ్‌లు ఇప్పుడు మండల కేంద్రాలతో పాటు, పట్టణాలకు విస్తరించాయి. ఈ క్రమంలోనే చింతపల్లి మండల కేంద్రంతో పాటు వేంకటేశ్వరనగర్(మాల్)లో జిమ్‌కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిని వినియోగించుకొని శారీరక దేహదారుఢ్యాన్ని క్రమంగా పెంచుకోవడంతో పాటు నిత్యం ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడంపై ఆసక్తి చూపుతున్నారు. యువకులే కాకుండా మధ్యవయస్సులు కూడా మారుతున్న కాలానికి అనుగుణంగా ఆరోగ్య పరిరక్షణపై దృష్టి పెడుతున్నారు. పరిమిత సమయంలో శాస్త్రీయంగా వ్యాయామం చేయడానికి జిమ్‌లు ఉపకరిస్తున్నాయి.

బరువు తగ్గడంపై ఆసక్తితో..

శారీరకంగా బరువు తగ్గించుకోవడంపై దృష్టితో పలువురు జిమ్‌ల్లో కసరత్తులు చేసుస్తున్నారు. ఎస్‌ఐ పోలీస్ కానిస్టేబుల్, సైన్యం వంటి ఉద్యోగాల కోసం దేహదారుఢ్య పరీక్షల్లో విజయం సాధించేందుకు మరికొందరు జిమ్‌లను తమ శరీర ఆకృతిని పొందేందుకు వినియోగించుకుంటున్నారు. నడివయస్సు వారుకూడా వ్యాయామ కేంద్రానికి వచ్చి తమ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడానికి ఉదయం, సాయంత్రం వేళలో వ్యాయామం చేస్తున్నారు.



ఉల్లాసంగా ఉంటుంది

నిత్యం వ్యాయామ కేంద్రం లో వివిధ పరికరాలతో వ్యాయా మం చేస్తున్నాను. దీంతో శరీరం మరింత గట్టిపడటంతో పాటు మనస్సు కూడా చాలా ఉల్లాసంగా ఉంటుంది. ప్రతి రోజు ఉద యం, సాయింత్రం జిమ్‌లో సాధన చేస్తాను.

-ఎస్.మహేష్, పోలేపల్లిరాంనగర్.



ఎస్‌ఐ కావాలని

జీవితంలో ఎస్‌ఐ కావాలన్నది నా కోరిక. అందుకే ఇక్కడ ఏర్పాటు చేసిన జిమ్‌కు వచ్చి శరీర దృఢత్వాన్ని పెంపొందించుకుంటున్నాను. ఫిట్‌నెస్ ఉంటే పోలీస్ ఎంపిక ప్రక్రియలో సగం విజయం సాధించిట్టేనని నా నమ్మకం.

-గంజి శ్రీకాంత్,
బీటెక్ విద్యార్థి(కుర్మేడ్)



ఎండీ మిస్కిల్, మ్యాక్స్ జిమ్ నిర్వాహకుడు, వీ.టీనగర్

రెండు పూటల సాధన చేస్తే ఆరోగ్యం

ఉదయం, సాయంత్రం వ్యాయామం తప్పకుండా చేయాలి. భోజనం చేశాక మూడు గంటల వరకు వ్యాయామం చేయవద్దు. తక్కువ బరువుతో ఎక్కువ సార్లు సాధన చేస్తే ఎంతో మచింది. కసరత్తు ప్రారంభానికి ముందు ప్రాక్టిస్ చేస్తే శరీర అవయవాలు వ్యాయామం చేయడానికి అనుకూలంగా ఉంటాయి. పాలు, పండ్లు, గుడ్లు, వంటి పోషకహారం క్రమం తప్పకుండా తీసుకుంటే చాలా మంచింది. యువతతో పాటు మధ్యవయస్సుకు సంబంధించిన వారు జిమ్‌ల వైపు మొగ్గు చూపుతున్నారు.

-ఎండీ.మిస్కిల్, జిమ్ నిర్వాహకుడు(వెంకటేశ్వరనగర్(మాల్).

బీసీ కోటా పెరగడం పక్కా!

(5వపేజీ తరువాయి)

గ్రామపంచాయతీల్లో 40శాతం, ఎంపీటీసీ స్థానాల్లో 35శాతం, జడ్పీటీసీ స్థానాల్లో 25శాతం సీట్లు కైవసం చేసుకున్నారు. గ్రామ స్థాయిలో ఉండే సర్పంచ్, ఎంపీటీసీ స్థానాల్లో జనరల్ సీట్లలోనూ అత్యధికంగా గెలుపొందిన బీసీ అభ్యర్థులు, జడ్పీటీసీ స్థానాల్లో కేవలం 2శాతం మాత్రమే జనరల్ సీట్లలో గెలుపొందారు. అసెంబ్లీ నియోజకవర్గం, స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక ఓటర్లతో ఎన్నికయ్యే జడ్పీటీసీ స్థానానికి పరిధి మండల స్థాయి ఉండడం, ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండడం వంటి కారణాలతో వీటిల్లో జనరల్ సీట్లలో బీసీలు పోటీచేసే పరిస్థితి ఉండదనేందుకు ఈ ఫలితాలే నిదర్శనంగా చెబుతున్నారు. అదే గ్రామపంచాయతీలు, ఎంపీటీసీ స్థానాల్లో జనరల్ సీట్లలోనూ బీసీలు హవా కొనసాగించారు.

జడ్పీటీసీ జనరల్ స్థానాల్లో బీసీలకు పెరగని పట్టు

జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులుగా మాత్రం బీసీ నాయకులు జనరల్ స్థానాల్లో పరిమితంగానే పోటీచేశారు. మండల స్థాయిలో నియోజకవర్గం ఉండడం, ఖర్చు భారీగా పెట్టాల్సిరావడం, పార్టీల్లో సైతం ఓసీ అభ్యర్థులను నిలువరించి బీ-ఫారాలు దక్కించుకోలేకపోవడం వంటి కారణాలతో జడ్పీటీసీ సభ్యులుగా పోటీచేసే విషయంలో రిజర్వ్‌డ్ స్థానాల్లో తప్ప జనరల్ స్థానాల్లో బీసీ అభ్యర్థులు దూకుడు ప్రదర్శించలేకపోయినట్లు రాజకీయపార్టీల నేతలు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 71 జడ్పీటీసీ స్థానాలకు బీసీ అభ్యర్థులు 25శాతం మేర అంటే 18 సీట్లలో విజయం సాధించారు. బీసీ రిజర్వ్‌డ్ సీట్లు 11కి అదనంగా జనరల్ సీట్లలో మరో ఏడుగురు అభ్యర్థులు గెలుపొందారు. అదేవిధంగా జనరల్ స్థానమైన త్రిపురారంలో ఎస్టీ అభ్యర్థి భారతీనాయక్ విజయం సాధించడం, అక్కడ లంబాడా సామాజికవర్గ ఓటుబ్యాంకు గణనీయంగా ఉండడమే కారణంగా చెబుతున్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకొని జనరల్ స్థానాల్లో బీసీలకు అవకాశమివ్వాలనుకుంటే, ఏ స్థానాల్లో అవకాశమిస్తారో వాటిల్లో అధికార, ప్రతిపక్ష పార్టీలన్నీ బీసీ అభ్యర్థులనే నిలబెడితే పార్టీలు బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధితో ఉన్నట్లని, లేదంటే కంటితుడుపు కేటాయింపులుగానే చూడాల్సి ఉంటుందని బీసీ నేతలు అభిప్రాయపడుతున్నారు.

సర్పంచ్‌లుగా 40శాతం, ఎంపీటీసీ సభ్యులుగా 35శాతం

ఉమ్మడి జిల్లాలో 2019లో చివరిసారిగా జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో మొత్తం సర్పంచ్ పదవుల్లో 40శాతం బీసీ సామాజికవర్గాల నాయకులు గెలుపొందారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,730 గ్రామపంచాయతీలకు 687 పంచాయతీల్లో సర్పంచ్‌లుగా బీసీ నేతలు గెలుపొందారు. 497 గ్రామపంచాయతీ సర్పంచ్ పదవులు బీసీలకే రిజర్వ్ కాగా, మరో 190 జనరల్ స్థానాల్లోనూ బీసీ అభ్యర్థులు పోటీపడి గెలుపొందారు. జనరల్ స్థానాల్లో నల్లగొండ జిల్లాలో 79 మంది, సూర్యాపేటలో 52 మంది, యాదాద్రి భువనగిరి జిల్లాలో 59 మంది సర్పంచులుగా గెలిచారు. ఉమ్మడి జిల్లాలో 718 ఎంపీటీసీ స్థానాలకు 251 మంది బీసీ నాయకులు విజయం సాధించారు. అందులో బీసీ రిజర్వేషన్ స్థానాలు 161 అయితే, మిగిలిన 90 జనరల్ సీట్లలో బీసీలు గెలుపొందారు.

రైతు బీమాకు వేళాయే

(5వపేజీ తరువాయి)



6,500 మంది వరకు ఉన్నారు. కొత్త పాస్ పుస్తకాలు పొందిన వారు ఈనెల 13లోగా దరఖాస్తు చేసుకుంటే వారందరికీ బీమా పథకం వర్తిస్తుంది. ఈ బీమాకు సంబంధించి ప్రీమియం పూర్తి స్థాయి చెల్లింపు రాష్ట్ర ప్రభుత్వం చేయనుంది. ఈనెల 14 నుంచి 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈ పథకం అమలుకానుంది. గత ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని తీసుకురాగా, ప్రస్తుత ప్రభుత్వం దీన్ని యథావిధిగా కొనసాగిస్తోంది. ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లిస్తూ జీవో జారీ చేసింది. గుంట భూమి నుంచి మొదలు ఎంత భూమి ఉన్నా ఆయా రైతులకు బీమా వర్తిస్తుంది.

బీమాతో రైతు కుటుంబాలకు ప్రయోజనం

రైతు బీమా పథకంతో రైతు కుటుంబాలకు ఎంతో ప్రయోజనం కలుగుతోంది. రైతు ఏ కారణంతో మృతిచెందినా ఈ బీమాను వర్తిస్తుంది. అయితే బీమా పాలసీ ప్రకారం 18 నుంచి 59 ఏళ్ల వయసు ఉన్నవారికే వర్తిస్తుంది. అయితే వయస్సును సడలించి 59ఏళ్లు పైబడిన వారికి కూడా బీమా కల్పించాలనే డిమాండ్ చాలా కాలంగా ఉన్నా, ప్రభుత్వం ఆ వైపు దృష్టి సారించలేదు. బీమా కంపెనీలు వయస్సును సడలించాలనే డిమాండ్‌కు అంగీకరించకపోవడం వల్లే గతంలో ఉన్న మాదిరిగానే రాష్ట్ర ప్రభుత్వం రెన్యూవల్ చేస్తోంది. ఒక్కటి కంటే ఎక్కువ గ్రామాలు, క్లస్టర్‌లలో భూములు ఉన్న రైతులు సైతం ఒక్కసారి మాత్రమే నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఒక గ్రామంలో నమోదు చేసుకున్న రైతులు వేరే గ్రామంలో భూమి ఉన్నా నమోదు చేసుకోవాల్సిన అవసరం లేదు. కొన్ని సార్లు రైతుల నామినీ వివరాలు లేకుండానే దరఖాస్తులు చేయడం వల్ల ఏదైనా కారణంతో రైతు చనిపోతే ఆ కుటుంబంలో నామినికీ బీమా సొమ్ము రాకుండా పోయిన సందర్భాలు ఉన్నాయి. అదేవిధంగా ఆధార్ తప్పు లేదా నామినీ ఆధార్ నెంబర్ పొరపాటు, బ్యాంకు ఖాతా నెంబర్‌లో పొరపాటు ఉంటే బీమా సొమ్ము రావడం కష్టం. వీటన్నంటిని దృష్టిలో ఉంచుకొని రైతులు వ్యవసాయశాఖ అధికారుల వద్దకు వెళ్లి బీమాకు సంబంధించి ఎలాంటి పొరపాట్లు లేకుండా సమగ్ర వివరాలు ఇవాల్సి ఉంటుంది.

కొత్త రైతులు 13లోగా దరఖాస్తు చేయాలి



ప్రభుత్వం రైతు బీమా పథకం రెన్యూవల్ కోసం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈనెల 13తో ఇప్పటికే అమలులో ఉన్న బీమా స్కీం ముగుస్తుంది. 14 నుంచి మళ్లీ కొత్తగా పథకాన్ని పునరుద్ధరిస్తారు. గతంలో దరఖాస్తు చేసుకున్న రైతుల డేటా యథావిధిగా రెన్యూవల్ అవుతుంది. కొత్త పాస్‌పుస్తకం పొందిన రైతులు మాత్రం ఈనెల 13లోపు దరఖాస్తులు చేసుకోవాలి. ఎక్కడైనా రైతులు నామినీల పేర్లను, ఆధార్ పాస్ పుస్తకాల నెంబర్లను మార్చుకోవాలనుకుంటే వ్యవసాయ అధికారులను సంప్రదించాలి. ఎలాంటి పొరపాట్లు లేకుండా రైతులు వారి వివరాలను అందించాలి. పొరపాట్లు జరిగితే రైతు దురదృష్టవశాత్తు చనిపోతే బీమా సొమ్ము నామినీలకు అందజేయడానికి సాంకేతిక సమస్యలు ఎదురవుతాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు సరైన వివరాలు అందించాలి.

పి.శ్రవణ్‌కుమార్, జేడీఏ, నల్లగొండ

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట ఎస్పీ ప్రసన్నకుమార్

• నేరస్తుల నుంచి 9.8 కిలోల గంజాయి స్వాధీనం

సూర్యాపేటక్రైం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నిషేధిత గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని నాగారం పోలీసులు అరెస్టుచేశారు. వారి నుంచి 9.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను సూర్యాపేట డీఎస్పీ వి.ప్రసన్నకుమార్ శనివారం జిల్లాకేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కామారెడ్డి జిల్లా పెద్దకొడపగల్ మండలం పోచారం గ్రామానికి చెందిన డ్రైవర్‌గా పనిచేసే పడవాల్ సుధార్, కామారెడ్డి జిల్లా పెద్ద కొడపగల్ మండలం కాటేపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్‌గా పని చేసే బర్దవాల్ శంకర్ ఇద్దరూ కలిసి సులభంగా డబ్బులు సంపాదించాలని భావించారు. అందుకోసం ఇతర రాష్ట్రానికి వెళ్లి గంజాయిని తెచ్చి తమ ప్రాంతంలో విక్రయించి సొమ్ము చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా ఈ నెల 3వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పాడేరు సమీపంలో ఇది వరకే పరిచయం ఉన్న మహేష్ అనే వ్యక్తి వద్ద కిలో గంజాయిని వెయ్యి చొప్పున సుమారు 10 కిలోలు కొనుగోలు చేశారు. గంజాయిని తీసుకుని ఈ నెల 7వ తేదీన బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో వారి గ్రామానికి వెళ్లేందుకు బయలుదేరారు. అందులో భాగంగా సూర్యాపేటలో జనగాం వెళ్లే బస్సు ఎక్కారు. నాగారం వచ్చే సరికి తిరుమలగిరిలో పోలీసులు తనిఖీలు చేస్తారని భావించి తొర్రూరు మీదుగా వెళ్లాలని నిర్ణయించుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో బస్సు దిగారు. నాగారం క్రాస్‌రోడ్డు వద్ద ఇద్దరూ బ్యాగులు పట్టుకుని అనుమానంగా ఉండడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసులు వారిని ప్రశ్నించారు. సరైన సమాధానం చెప్పకపోవడంతో వారి వద్ద ఉన్న బ్యాగులను తనిఖీచేయగా గంజాయి లభించింది. వెంటనే శంకర్, సుధార్‌లను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదే విధంగా వారి నుంచి 9.8కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలిస్తున్నామని, స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ మార్కెట్‌లో సుమారు రూ.2.45లక్షలు ఉంటుందని డీఎస్పీ వెల్లడించారు. సమావేశంలో నాగారం సీఐ నాగేశ్వర్ రావు, ఎస్‌ఐ ఐలయ్య, సిబ్బంది వెంకన్న, నారాయణరెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

సూర్యాపేట జిల్లాలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని సూర్యాపేట డీఎస్పీ వి. ప్రసన్నకుమార్ హెచ్చరించారు. జిల్లాకేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సూర్యాపేట పట్టణంలోని శ్రీశ్రీనగర్‌లోని ఓ ఇంట్లో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పట్టణ పోలీసులు దాడి చేశారని తెలిపారు. పేకాట ఆడుతున్న ఎనిమిది మందిలో ఇద్దరు పరారు కాగా, ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని వివరించారు. వారి నుంచి రూ.42వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బర్త్‌డే వేడుకల్లో బీరుసీసాలతో దాడి



గాయపడిన మధు

నకిరేకల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నకిరేకల్‌లోని తాటికల్‌రోడ్డులో శుక్రవారంరాత్రి జరిగిన బర్త్‌డే వేడుకల్లో మద్యం తాగి మాటా మాట పెరిగి ఒకరిపై ఒకరు ఘర్షణ పడి బీరుసీసాలతో దాడి చేసుకున్నారు. ఎస్‌ఐ లచ్చిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తాటికల్ రోడ్డుకు చెందిన పెరుమాళ్ల సాగర్ బర్త్‌డే సందర్భంగా ఆయన స్నేహితులను ఇంటికి ఆహ్వానించారు. అందరూ కలిసి మద్యం తాగిన తర్వాత కొండ మధుతో వరుణ్, యశ్వంత్‌లు ఘర్షణ పడ్డారు. మాటామాట పెరిగి బీరుసీసాతో తలపై కొట్టి పగిలిన బీరుసీసాతో గొంతు కోశారు. తీవ్రంగా గాయపడిన మధును స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొండ మధు ఫిర్యాదు మేరకు వరుణ్, యశ్వంత్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు

కేతేపల్లి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కాలినడకన రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన నల్లగొండ జిల్లా కేతేపల్లిలో శనివారం 65వ నెంబరు జాతీయ రహదారిపై జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నర్సింహులపేట మండలంలోని రేపోని గ్రామానికి చెందిన బేతం సత్తమ్మ సూర్యాపేట మండలంలోని రాయినిగూడంలోని తమ బంధువుల ఇంటికి వెళ్లేందుకు సూర్యాపేట జిల్లాకేంద్రంలో బస్సు ఎక్కింది. గ్రామాన్ని గుర్తించలేకపోయిన సత్తమ్మ కేతేపల్లి వరకు ప్రయాణించింది. అప్పటికి గుర్తించిన కండక్టర్ ఆమెను మండల కేంద్రం కేతేపల్లిలో దించివేశాడు. దీంతో సత్తమ్మ రాయినిగూడెం వెళ్లేందుకు ఎటు వెళ్లాలని కేతేపల్లిలో సమాచారం అడిగి తెలుసుకుని తిరిగి బస్సు ఎక్కేందుకు కాలినడకన హైవేను దాటుతుంది. ఈ క్రమంలో హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపు వేగంగా వెళుతున్న కారు సత్తమ్మను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన సత్తమ్మ అపస్మారక స్థితికి వెళ్లింది. సమాచారం అందుకున్న 108 సర్వీస్ సిబ్బంది సత్తమ్మను చికిత్సకోసం సూర్యాపేట జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాద సంఘటన సమాచారం తెలుసుకున్న సత్తమ్మ కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రికి చేరుకుని మెరుగైన చికిత్స కొరకు సత్తమ్మను హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిసింది.

రహదారులపై నిలిచి ఉన్న వాహనాలే లక్ష్యంగా..

డీజిల్ అపహరిస్తున్న దొంగల ముఠా

• త్వరలో పట్టుకుంటామన్న పోలీసులు



నార్కట్‌పల్లి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): 65వ నెంబరు జాతీయ రహదారి, నార్కట్‌పల్లి-అద్దంకి రహదారులపై నార్కట్‌పల్లి మండలపరిధిలో దొంగల ముఠాల హల్‌చల్ రోజురోజుకూ అధికమవుతోంది. ఈ రాష్ట్ర, జాతీయ రహదారులపై నిలిపి ఉన్న వాహనాలే టార్గెట్‌గా దొంగలు డీజిల్ దోపిడీకి పాల్పడుతున్నారు. రహదారులవెంట నిలిచి ఉన్న వాహనాల నుంచి డీజిల్ దొంగిలించిన ఘటనలపై ఇప్పటికే నార్కట్‌పల్లి, చిట్యాల పోలీస్‌స్టేషన్లలో పలు ఫిర్యాదులు ఉన్నాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై గుర్తు తెలియని వ్యక్తులు కొందరు ఆగి ఉన్న వాహనం నుంచి డీజిల్ దొంగతనం చేస్తుండగా స్థానికుల నుంచి అందిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోవడంతో దొంగల ముఠా పరారైంది. సంఘటనా స్థలంలో పోలీసులకు ఆగంతకులు వినియోగించిన ఇన్నోవా వాహనం, అందులోని 12 వందల లీటర్ల డీజిల్ పట్టుబడింది. వీటిని స్వాధీనం చేసుకున్న నార్కట్‌పల్లి పోలీసులు ఆగంతకుల ముఠాను పట్టుకునే యత్నాల్లో ఉన్నారు. త్వరలోనే ఈ ముఠాను పట్టుకుంటామని ఎస్‌ఐ డి.క్రాంతికుమార్ తెలిపారు.

రెండో రోజు.. అదే తీరు



చౌటుప్పల్ పట్టణంలోని హైవేపై బారులుతీరిన వాహనాలు

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని హైదరాబాద్-విజయవాడ 65వ నంబరు జాతీయ రహదారిపై రెండో రోజు శనివారం కూడా వాహనాలు విజయవాడ వైపు బారులుతీరాయి. శుక్రవారం సాయంత్రం నుంచి ప్రారంభమైన వాహనాల జోరు శనివారం మధ్యాహ్నం వరకు కొనసాగింది. ఆదివారం సాయంత్రం నుంచి పల్లెల నుంచి వాహనాలు తిరిగి నగరానికి వెళ్లనున్నాయి. హైవే జంక్షన్ల వద్ద వాహనాలను నియంత్రించేందుకు అటు ట్రాఫిక్, ఇటు సివిల్ పోలీసులు చర్యలు తీసుకున్నారు.

(ఆంధ్రజ్యోతి-చౌటుప్పల్ టౌన్)

ముమ్మరంగా టర్బైన్ మరమ్మతులు

- నూతన గైడ్‌వేన్ ఏర్పాటు
- రూ.7.50 కోట్లతో బీహెచ్ఈఎల్ వద్ద కొనుగోలు
- ఈనెల15వ తేదీ నాటికి పూర్తి: జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్



నాగార్జునసాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలోని మొదటి నంబర్ టర్బైన్‌కు మరమ్మతులు చేస్తున్న ఇంజనీర్లు

నాగార్జునసాగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలోని మొదటి టర్బైన్‌కు చేపట్టిన మరమ్మతు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 15వ తేదీనాటికి మరమ్మతులు పూర్తిచేస్తామని జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో మొత్తం ఎనిమిది టర్బైన్లు ఉండగా 815.6 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం కలిగి ఉంది. మొదటి టర్బైన్‌ను 1978 సంవత్సరంలో హైదరాబాద్ బీహెచ్ఈఎల్ ఏర్పాటుచేయగా, మిగిలిన ఏడు టర్బైన్లు జపాన్ సాంకేతిక నైపుణ్యానికి చెందినవి. మొదటి నెంబర్ టర్బైన్‌కు మరమ్మతులు చేసి 20ఏళ్లు అవుతుండటంతో క్యాపిటల్ ఓవరాల్ చేస్తున్నారు. మొదటి టర్బైన్ గైడ్ వేన్‌లు అరిగిపోవడంతో(వార్న్ అవుట్) విద్యుదుత్పత్తి నిలిపివేసిన సమయంలో నీటి వృథా(నీరు లీకేజీ) కావడంతో పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి కష్టమవుతోంది. ఈ క్రమంలో ఈ ఏడాది ఏప్రిల్ 10వ తేదీన మొదటి నెంబర్ టర్బైన్‌కు మరమ్మతులు ప్రారంభించగా బీహెచ్ఈఎల్ నుంచి రూ.7.50 కోట్ల వ్యయంతో నూతన గైడ్‌వేన్ మెకానిజం కొనుగోలు చేసి అరిగిన టర్బైన్ గైడ్ వేన్‌లను కొత్తవి ఏర్పాటుచేస్తున్నారు. ఈ సందర్భంగా జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్ మాట్లాడుతూ మొదటి టర్బైన్ మరమ్మతులు ఆగస్టు 15వ తేదీ నాటికి పూర్తి చేస్తామన్నారు. బీహెచ్ఈఎల్ నుంచి గత నెలలోనే మొదటి టర్బైన్‌కు నూతన గైడ్‌వేన్‌లను తీసుకొచ్చామని, ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలోని మెకానికల్ విభాగంలో ఇంజనీర్లు మరమ్మతులు చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో ఏడు టర్బైన్ల ద్వారా విద్యుదుత్పత్తి చేస్తున్నామన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



ఉత్సవమూర్తులకు హారతి సమర్పిస్తున్న అర్చకుడు మాధవాచారి

యాదగిరిగుట్ట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి వారి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరిగాయి. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవారలను దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేద మంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించిన అర్చకులు సాయంత్రం వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.24,04,564 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. కాగా, ప్రతీవారం నిర్వహించే సంగీత సభల్లో భాగంగా కళారాధన మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమి (విశాఖపట్నం) కూచిపూడి నృత్యం భక్తులను అలరించింది.

ఆరు క్వింటాళ్ల నల్ల బెల్లం స్వాధీనం




ఆటోను స్వాధీనం చేసుకున్న చింతపల్లి ఎస్ఐ, సిబ్బంది

చింతపల్లి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై అక్రమంగా నల్ల బెల్లం తరలిస్తున్న ఆటోను శనివారం పోలీసులు పట్టుకున్నారు. చింతపల్లి ఎస్ఐ రాంమూర్తి తెలిపిన వివరాల ప్రకా రం.. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం పెండ్లిపాకల గ్రామానికి చెందిన రమావత్ శివకుమార్ ఎలాంటి అనుమతి లేకుం డా అక్రమంగా ఆటోలో ఆరు క్వింటాళ్ల నల్ల బెల్లాన్ని హైదరాబాద్‌నుంచి మల్లేపల్లి వైపునకు తరలిస్తున్నారు. తగిన సమాచారం మేరకు ఎస్ఐ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా పోలేపల్లిరాంనగర్ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న బెల్లం ఆటోను తనిఖీ చేశారు. ఆటోలో ఆరు క్విం టాళ్ల నల్లం బెల్లం ఉన్నట్లు గుర్తించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి వాహనం సీజ్ చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గతం.. మోటార్ ప్రస్తుతం.. సెన్సార్

- సాగర్ ప్రాజెక్ట్ నిర్వహణ అంతా ఆ గదిలోనే



ఎన్ని గేట్లు ఎత్తారో కంప్యూటర్‌లో చూపుతున్న సెన్సార్ విధానం, సాగర్ ప్రధాన డ్యాం కంట్రోల్ రూంలో ఉన్న ఆటో మిషన్ సెన్సార్ విధానం



తెలుగు రాష్ట్రాల అన్నపూర్ణ.. భారతీయ ఇంజనీర్ల మేధాశక్తికి ప్రతిరూపం నాగార్జునసాగర్. ప్రపంచంలోనే అతి ఎత్తయిన రాతి కట్టడంగా పేరెన్నికగన్నది. లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తూ.. కోట్లాది ప్రజల తాగునీటి కష్టాలు తీర్చుతున్న సాగర్ ప్రాజెక్ట్ నిర్వహణ అంతా సెన్సార్ విధానంలోనే కొనసాగుతోంది. గేట్లు ఎత్తాలన్నా, మూసివేయాలన్నా ఆ రూమ్ నుంచే ఆపరేటింగ్ చేస్తారు.

(ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్)

ఎగువన ఉన్న అన్ని ప్రాజెక్టులు నిండిన తర్వాతే సాగర్‌కు ప్రతీ సంవత్సరం జూన్, జూలైలో వరద రాక మొదలవుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయికి (590 అడుగులు) చేరుకోగానే క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన తర్వాత గేట్లను మోటార్ల ద్వారా పైకి ఎత్తేవారు. ఆ తర్వాత కొంత కాలానికి ఆటోమెటిక్ విధానంలో గేట్లను పైకి ఎత్తేవారు. కాలనుగుణంగా పెరుగుతున్న ఆధునిక పరిజ్ఞానంతో గేట్లు ఎత్తే విధానం పూర్తిగా ఆటో మిషన్ సెన్సార్ ఆపరేటింగ్‌తో నిర్వహిస్తున్నారు. ఈ విధానాన్ని ప్రధానడ్యాంతోపాటు, కుడి, ఎడమ కాల్వల గేట్లను ఎత్తడానికి కూడా 2018లో రూ.5కోట్లతో ఏర్పాటుచేశారు. 2018 నుంచి సాగర్ ప్రాజెక్టు గేట్లను, కుడి, ఎడమ కాల్వల గేట్లను ఆటో మిషన్ సెన్సార్ ఆపరేటింగ్ విధానాంతోనే ఎత్తేవారు. 2023లో ప్రధాన డ్యాంపై తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదం నెలకొన్న సమయంలో కాల్వల సెన్సార్ కేబుల్‌లు అన్నీ ధ్వంసమయ్యాయి. దీంతో ప్రస్తుతం ప్రధానడ్యాం గేట్లకు మాత్రమే ఆటో మిషన్ సెన్సార్ విధానంలో ఎత్తే సౌకర్యం ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

సెన్సార్ ఆపరేటింగ్ పనిచేస్తుందిలా..

సాగర్ ప్రాజెక్టు గేట్ల ఆటో మిషన్ సెన్సార్ ఆపరేటింగ్ విధానం అంతా కంట్రోల్ రూంలోనే ఉంటుంది. ఇందులో ఓ కంప్యూటర్‌లో 26 క్రస్ట్ గేట్లు, కుడి కాల్వ తొమ్మిది గేట్లు, ఎడమ కాల్వ మూడు గేట్లు కన్పిస్తాయి. ఇవి మూసి ఉన్నాయా? లేదా ఎత్తారా? అని తెలుస్తుంది. ఒకవేళ గేట్లు ఎత్తితే ఏ గేటును ఎంత మేరకు ఎత్తారు, ఆ గేటు ద్వారా ఎన్ని క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతుంది అనే విషయం కూడా కంప్యూటర్‌లో వెల్లడవుతుంది. డ్యాంలో ఎన్ని అడుగుల నీరు ఉందనే విషయం కూడా అందులో కన్పిస్తుంది. గేట్లను పైకెత్తడం, దించడం వంటివి ఈ కంట్రోల్ రూం నుంచి టెక్నికల్ సిబ్బంది మానిటరింగ్ చేస్తారు. అంతేకాకుండా ఆటో మిషన్ సెన్సార్ ఆపరేటింగ్ సిస్టంకు ఏదైనా సమస్య తలెత్తితే గేట్ల పైనుంచి కూడా మ్యాన్‌వల్‌గా గేట్లను ఎత్తవచ్చు.

ముందుస్తు జాగ్రత్తలతో అధిక దిగుబడి

- ఏటా గులాబి రంగు పురుగు దాడితో భారీగా నష్టపోతున్న రైతులు

మోత్కూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వరి తర్వాత ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులకు ప్రధాన పంట పత్తి. రైతులు పత్తిని ఆప్యాయంగా తెల్ల బంగారంగా పిలుచుకుంటారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో లక్షల ఎకరాల్లో సాగ య్యేది వరి, తర్వాత పత్తి మాత్రమే. మిగతా పంటల సాగు అంతంత మాత్రమే. అంతటి ప్రాధాన్యం కల్గిన పత్తి ఒకటి, రెండు సార్లు ఏరగానే మిగతా కాయలకు గులాబి రంగు పురుగు ఆశించి పంట దెబ్బతిని రైతులు నష్టపోతున్నారు. ఇప్పటి (పూత, కాత ప్రారంభం) నుంచే తగిన ముందు జాగ్రత్తలు తీసుకుంటే చివరి దశలో వచ్చే గులాబి రంగు పురుగును నివారించవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.



లింగాకర్షక బుట్టల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్న ఏఈవో అశోక్

పురుగు విస్తరిస్తుంది ఇలా..

పత్తి 45రోజుల చేను అయ్యాక రెక్కల పురుగు చేలల్లో తిరుగుతూ పువ్వు వద్ద గుడ్డు పెడుతుంది. ఆ గుడ్డు 15 రోజుల్లో లార్వా దశకు వస్తుంది. అది పత్తి పిందెలకు చిన్న రంధ్రం చేసుకుని అందులోకి వెళ్లి కాయలో పత్తి మారే తెల్ల గుజ్జు, గింజలను తినేస్తుంది. దీంతో పత్తి కాయలు పుచ్చిపోయి పత్తి దిగుబడి దెబ్బతింటుంది. గులాబి రంగు పురుగు ఉధృతిని బట్టి 30 నుంచి 40 శాతం దిగుబడి తగ్గుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

లింగాకర్షక బుట్టల ద్వారా నియంత్రణ

పత్తి 45రోజుల చేను కాగానే చేనులో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలి. గులాబి రంగు పురుగు ఉధృతిని పరిశీలించడానికి ఎకరాకు ఒక బుట్ట ఏర్పాటు చేయాలి. గులాబి రంగుపురుగు దాడిని నివారించడానికి ఎకరాకు 20 నుంచి 30 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలి. ఈ బుట్టలను భూమి నుంచి 1.5 మీటర్ల ఎత్తులో అమర్చాలి. ఆడ పురుగులు విడుదల చేసే లైంగికార్షణ గందం-ల్యూర్ ఆధారంగా రూపొందించిన బుట్టలలో మగ పురుగులు ఆకర్షించి, చిక్కించడం ద్వారా ఆడ పురుగుతో ప్రత్యుత్పత్తి జరపలేక బయట ఉన్న ఆడ పురుగు గుడ్లు పెట్టదు. తద్వారా పురుగు ఉధృతి తగ్గుతుంది. ల్యూర్‌ను ప్రతీ 20 రోజులకోసారి మార్చుకోవాలి.



గులాబి రంగు పురుగుకు కారణమైన తల్లి రెక్కల పురుగు, కాయలో పురుగు ఉంటుంది ఇలా..

బుట్టల ఏర్పాటుతో ప్రయోజనం

వరుసగా మూడు రోజులలో 8 తల్లి పురుగుల కన్నా ఎక్కువ బుట్టలలో ఉన్నట్టయితే గులాబి రంగుపురుగు ఉధృతి ఎక్కువగా ఉందని గుర్తించాలి. రసాయన మందుల వినియోగం తగ్గుతుంది. పర్యావరణ పరిరక్షణ జరుగుతుంది. పంట దిగుబడి పెరగడంతో పాటు పత్తి నాణ్యతగా వస్తుంది.

తక్కువ ఖర్చుతో నిరవారణ చర్యలు చేపట్టాలి



పత్తి చేనులో గులాబి రంగు పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే దిగుబడి పెరుగుతుంది. గులాబి రంగు పురుగు ఉధృతి పెరిగాక రూ.వేలకు వేలు ఖర్చు చేసి హై డోస్ మందులు కొట్టి నష్టపోవడం కంటే ముందస్తుగా తక్కువ ఖర్చుతో నివారణ చర్యలు చేపట్టడం మంచిది. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు దాని నివారణకు క్రిమి సంహారక మందులు వాడాల్సి వచ్చినప్పుడు ఒక లీటరు నీటికి తయోడికార్బ్ 1.5 గ్రాములు లేదా ప్రొఫినోపాస్ 2 మి.లీ. కలిపి పిచికారి చేయాలి.

-ముప్పిడి అశోక్, వ్యవసాయ విస్తరణాధికారి, పాటిమట్ల

యెగాసన పోటీల్లో బంగారు పతకం

సూర్యాపేటటౌన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి) : ఈనెల 7, 8తేదీల్లో ఆదిలాబాద్ లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన గూడూరు నాగేశ్వరరావు ప్రథమస్థానం సాధించి బంగారు పతకం సాధించారు. శనివారం ఆదిలాబాద్‌లో రాష్ట్రస్థాయి యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్-2025 నిర్వాహకుల చేతుల మీదుగా బంగారు పతకాలను అందుకున్నారు. ఈసందర్భంగా నాగేశ్వరరావును జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తీకుళ్ల సాయిరెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీదేవి, శ్రీనివాస్‌లు అభినందించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ నిత్యం యోగాసనాలు సాధన చేయడంద్వారా అనా రోగ్యం దరిచేరకుండా ఉండొచ్చన్నారు.

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు

నాగార్జునసాగర్, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఐలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ ఇంజనీరింగ్‌లో 29 సీట్లు, ఈఈఈలో 02 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 10వ తేదీ వరకు కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 11వ తేదీన స్పాట్ అడ్మిషన్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9491398142, 9052571315 నంబర్లు సంప్రదించాలని వివరించారు.

బుద్ధవనం సందర్శనకు న్యూయార్క్ బౌద్ధాచార్యుని ఆసక్తి

నాగార్జునసాగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయంగా అనేక బౌద్ధ వారసత్వ ఆకర్షణల్లో పేరుగాంచిన నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని బుద్ధవనాన్ని, జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండను సందర్శించడానికి న్యూయార్క్‌కు చెందిన మహాయాన బుద్ధ విహార ప్రధానాచార్యుడు ఆసక్తి కనబరిచారని బౌద్ధ పరిశోధకుడు, ఫ్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన న్యూయార్క్‌లోని బౌద్ధాలయాల సందర్శనలో భాగంగా శనివారం న్యూయార్క్ కెనాల్ వీధిలో మహామాన బౌద్ధాలయాన్ని సందర్శించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ తెలుగు నేలపై నాగార్జునసాగర్‌లో ఉన్న బుద్ధవనం, నాగార్జునకొండలను సందర్శించాలని అక్కడి వారికి చెప్పానన్నారు. అ బుద్ధవనంలో ఆచార్య నాగార్జునుడి రచనలపై ఒక పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వారు కోరినట్లు తెలిపారు. అమెరికాలోని బౌద్ధ విహారాలు, బౌద్ధలయాల ప్రతినిధులతో కృష్ణ తీరంలో వెలసిన ప్రముఖ బౌద్ధ స్థావరాలను గురించి తెలుసుకోవడానికి తగిన సమాచారాన్ని అందజేయాలనిని ఆయన కోరినట్లు తెలిపారు. తాను త్వరలో బుద్ధవనం అధికారులతో కలిసి ఈ విషయంపై చర్చించి కేవలం దక్షిణాసియా దేశాల నుంచే కాకుండా యూరోప్, అమెరికా, ఆస్ట్రేలియా, దేశాలకు చెందిన బౌద్ధ పర్యాటకులను ఆకర్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట ప్రముఖ ఆహార శాస్త్రవేత్త , న్యూయార్క్ తెలుగు లిటరసీ అండ్ కల్చర్ సోసైటి ప్రతినిధి, కథా రచయిత డాక్టర్ కలశపూడి శ్రీనివాసరావు ఉన్నట్లు తెలిపారు.



న్యూయార్క్ బౌద్ధాలయం సందర్శనలో ఈమని శివనాగిరెడ్డి

నేడు మళ్లీ తెరుచుకోనున్న సాగర్ గేట్లు

- ఈ ఏడాది రెండోసారి నీటి విడుదల
- 589.70 అడుగులకు చేరుకున్న నీటిమట్టం

నాగార్జునసాగర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను ఆదివారం ఉదయం 6గంటలకు ఎత్తనున్నట్లు ప్రాజెక్టు ఎస్ఈ మల్లిఖార్జున్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగార్జునసాగర్‌కు 10 రోజులుగా ఎగువ నుంచి వరద రాక నిలకడగా 50వేలు క్యూసెక్కులుగా కొనసాగుతోంది. దీంతో సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతూ పూర్తిస్థాయికి (590 అడుగులు) చేరువలో ఉంది. దీంతో ఆదివారం ఉదయం రెండు క్రస్ట్ గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయనున్నట్లు ఎస్ఈ తెలిపారు. ఎగువ నుంచి వరద రాకను బట్టి గేట్ల సంఖ్యను పెంచనున్నట్లు తెలిపారు. ఈ నీటి సంవత్సరంలో (ఈ ఏడాది జూన్ 1 నుంచి వచ్చే ఏడాది మే 31వ తేదీ వరకు) సాగర్ గేట్లు రెండోసారి ఎత్తనున్నట్లు ఎస్ఈ తెలిపారు. మొదటి సారి జూలై 29 నుంచి ఆగస్టు 6వ తేదీ వరకు గేట్లను ఎత్తి దిగువకు 85టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం శనివారం సాయంత్రానికి 589.70 అడుగులుగా ఉంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 589.70 అడుగులుగా (311.1486టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 6,041 క్యూసెక్కుల నీటిని, ఎడమకాల్వ ద్వారా 7,436 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 300 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,070 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 44,647 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా, ఎగువ నుంచి 44,647 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.



నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో 589.70 అడుగుల వద్ద నీటిమట్టం

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో..

కేతేపల్లి/ సూర్యాపేటరూరల్ : హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ మూసీ మూసీ పరివాహక ప్రాంతాల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇన్‌ఫ్లో భారీగా కొనసాగుతుంది. నాలుగు రోజులుగా ఇన్‌ఫ్లో తగ్గుతూ, పెరుగుతూ వస్తున్నా శుక్ర, శనివారాల్లో ఇన్‌ఫ్లో నిలకడగా వస్తోంది. ఒక్కోసారి ఇన్‌ఫ్లో భారీగా పెరిగి 10వేల క్యూసెక్కులుగా నమోదవుతోంది. దీంతో ప్రాజెక్టు అధికారులు 247 అప్రమత్తంగా ఉంటూ ఎగువ నుంచి వచ్చే ఇన్‌ఫ్లోకు అనుగుణంగా ప్రాజెక్టు క్రస్టుగేట్లను ఆపరేట్ చేస్తూ వరద నీటిని దిగువ మూసీకి వదులుతున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం వరకూ దాదాపు 4వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. దీంతో అధికారులు అప్పటి వరకూ ఎత్తి ఉంచిన గేట్లను మూసి వేసి కేవలం రెండో నెంబరు క్రస్టుగేటను 2అడుగుల మేర ఎత్తి ఉంచి 1283క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదిలారు. ఆ తర్వాత శనివారం సాయంత్రానికి ఇన్‌ఫ్లో 5082క్యూసెక్కులుగా ఉన్నప్పటికీ ప్రాజెక్టు నీటిమట్టం 644అడుగుల గరిష్ట స్థాయికి చేరడంతో పాటు హైదరాబాద్ నుంచి ఇన్‌ఫ్లో భారీగా వచ్చే సూచనలున్న నేపథ్యంలో అధికారులు ప్రాజెక్టు 2, 3, 4, 8, 10వ నెంబరు క్రస్టుగేట్లను 3అడుగుల మేర ఎత్తి 9598క్యూసెక్కుల వరద నీటిని దిగువ మూసీకి విడుదల చేస్తూ ప్రాజెక్టు నీటిమట్టాన్ని 643అడుగుల స్థాయికి చేర్చే యత్నాలు చేశారు. 645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటి మట్టం 643.22అడుగులు (4.00టీఎంసీలు)గా ఉంది. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టుకు 286.02క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



మూసీ ప్రాజెక్టు ఐదు క్రస్టుగేట్ల నుంచి దిగువకు వెళుతున్న వరద నీరు


చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కేతేపల్లి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణానికి చేసిన అప్పులు తీర్చేదారిలేక పోవడం... భార్యతో గొడవల నేపథ్యంలో గడ్డి మందుతాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి కేతేపల్లి ఎస్ఐ యు.సతీష్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలకేంద్రానికి చెందిన దుబ్బాక రాంరెడ్డి(47) రెండేళ్ల క్రితం ఇంటి నిర్మాణానికి స్థానికంగా అప్పులు చేశాడు. తెచ్చిన అప్పులు తీర్చకుండా తాగుడుకుబానిసైన రాంరెడ్డి తన భార్యతో తగవులు పడుతుండే వాడు. ఈ క్రమంలో శుక్రవారం ఇంట్లో భార్యతో గొడవ పడిన రాంరెడ్డి ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన ఇరుగు పొరుగు వారు చికిత్స కొరకు సూర్యాపేట జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్న రాంరెడ్డి ఆరోగ్యం విషమించి శనివారం మృతి చెందాడు. రాంరెడ్డి భార్య దుబ్బాక స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ సతీష్ వివరించారు.

ఆలయంలో ఘనంగా మాస కల్యాణం

నార్కట్‌పల్లి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానం, గోపలాయపల్లి వారిజాల వేణుగోపాల స్వామి ఆలయాల్లో పౌర్ణమి సందర్భంగా శనివారం మాసకల్యాణ వేడుకను ఘనంగా నిర్వహించారు. ప్రతీ నెలా పౌర్ణమి సందర్భంగా లోకకల్యాణార్థం మాస కల్యాణ వేడుకను నిర్వహిస్తూ ఉంటారు. ఈ వేడుకలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.





రోడ్లు ఇలా..రాకపోకలు ఎలా!

- వర్షం పడితే మరింత దారుణం
- సీసీ రోడ్ల నిర్మాణంలో జాప్యం
- ఇదీ నల్లగొండ మునిసిపాలిటీలోని 35 వ వార్డు పరిస్థితి

నల్లగొండ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని 35 వార్డులో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. కాలనీలో మట్టి రోడ్లు గుంతలమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. పట్టణంలోని హైదరాబాద్ రోడ్డును ఆనుకుని ఉన్న ఈ వార్డులో పద్మానగర్, హనుమాన్‌నగర్, న్యూ రాఘవేంద్రకాలనీ, ఎన్‌జీబీ కాలనీ, శివరాంనగర్, పద్మశాలీనగర్‌లో చాలా వరకు మట్టి రోడ్లు ఉన్నాయి. కొద్ది రోజులుగా అండర్ డ్రైనేజీ రోడ్లు వేస్తున్నారు. దీంతో ఉన్న రోడ్లను తవ్వడం వల్ల గుంతలమయంగా మారి నడవడానికి కూడా వీలు లేకుండాపోయింది. ద్విచక్ర వాహనాలు, కార్లు వెళ్లాలంటే సమస్యగా మారింది. ఇక వర్షాలు కురిసినప్పుడు ప్రజలు రోడ్ల మీద నడవాలంటే నరకయాతన ఎదుర్కొంటున్న పరిస్థితి ఏర్పడింది. పలుమార్లు ఉన్నతాధికారులు, మునిసిపల్ అధికారులకు వినతిపత్రాలు కూడా సమర్పించారు. అయిన వార్డులో మట్టిరోడ్ల పరిస్థితి మారడం లేదు. సీసీ రోడ్ల నిర్మాణం లేకపోవడం వల్ల సమస్యలు ఎదురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



35వార్డులో దారిలో నిలిచిన వర్షపు నీరు

డ్రైనేజీ పనుల కోసం తవ్వకాలు

డ్రైనేజీ పనుల కోసం తవ్వకాల కోసం వార్డులోని పలు ప్రాంతాల్లో పాత సీసీ రోడ్లను కూడా తవ్వారు. హనుమాన్ నగర్‌లోని పలు వీధుల్లో రోడ్లను తవ్వి డ్రైనేజీ లింకులను కలిపారు. అయితే రోడ్లు తవ్విన ప్రాంతంలో ఎక్కడికక్కడ మట్టి కుప్పలు ఉండటంతో నడవడం కూడా సమస్యగా మారుతుంది. హనుమాన్ నగర్‌లోని వెంకటసాయి ఫంక్షన్ హాల్ నుంచి మొదలుకొని రైలు అండర్ పాస్ బ్రిడ్జి వరకు రోడ్డు అధ్వానంగా మారిపోయింది. ఈ రోడ్డు మార్గం కూడా బతుకమ్మ చెరువు కుంట నుంచి టౌన్‌లోకి అధిక సంఖ్యలో వచ్చి పోతుంటారు. అయితే చెరువు కట్టపై కూడా రోడ్డు దారుణంగా ఉండగా ఆ కట్టపై నుంచి అండర్ పాస్ బ్రిడ్జి దాటిన తర్వాత మొత్తం 35వ వార్డులోని రోడ్లన్నీ దెబ్బతినడంతో ప్రజలకు సమస్య ఎదురవుతుంది.



గుంతలమయంగా మారిన రోడ్లు

ప్రస్తుతం మునిసిపల్ పాలకవర్గం లేకపోవడంతో అధికారులు సైతం స్థానికుల మాటలు కూడా పెడచెవిన పెడుతున్నట్లు తెలుస్తుంది. ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఎక్కడ వేసిన గొంగడి అన్న చందంగా పరిస్థితి తయారైంది. వెంటనే వార్డులో రోడ్డు సమస్యను పరిష్కరించాలని కాలనీలవాసులు డిమాండ్ చేస్తున్నారు.

మట్టిరోడ్లతో ప్రజలకు ఇబ్బందులు



మట్టి రోడ్ల స్థానంలో సీసీ రోడ్లను ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. మునిసిపల్ పాలకవర్గం ఉన్న సమయంలో కౌన్సిల్‌లో అనేక సార్లు వినతిపత్రాలు సమర్పించాం. అయినా అధికారులు పట్టించుకోలేదు. వర్షాలు వచ్చినప్పుడు మట్టి రోడ్లల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికార యంత్రాంగం వెంటనే స్పందించి ప్రజల బాధలను అర్థం చేసుకొని సమస్యలను పరిష్కరించాలి. కాలనీలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడటం వల్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. వర్షం పడినప్పుడు ఎక్కడి నీళ్లు అక్కడే ఉండి సమస్యగా మారుతుంది. దీంతో అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– గుర్రం ధనలక్ష్మి, మాజీ కౌన్సిలర్, 35వ వార్డు

అలుగుపోస్తున్న అడ్లూర్ చెరువు

శాలిగౌరారం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలంలో కురస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు నిండి అలుగుపోస్తున్నాయి. గత 3రోజుల కిందట అన్ని చెరువుల్లో, కుంటల్లో అంతంతా మాత్రమే ఉన్న నీరు గురువారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి ఒక్కసారిగా అన్ని నిండి అలుగుపోయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో నుండి కూడా పలు చెరువుల్లోకి ఇంకా నీరు వస్తూనే ఉంది. మండలంలో పలు గ్రామాల పక్క నుంచి మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తుంది.

చినుకు పడితే చిత్తడే...

కనగల్ బస్టాండ్‌కు వెళ్లేదెలా..?



కనగల్ బస్టాండ్ ఆవరణలోకి చేరిన వర్షం నీరు

కనగల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): చినుకు పడిందా కనగల్ బస్టాండంతా చిత్తడిగా మారుతోంది. కొద్దిపాటి వర్షం కురిసినా బస్టాండ్‌లోకి వర్షం నీరు వచ్చి చేరుతుంది. దీంతో బస్టాండ్ పరిసరాలు బురదతో నిండిపోయి ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు తప్పటం లేదు. వర్షాకాలం వచ్చిందంటే చాలు బస్టాండ్‌లో ఈ సమస్య ఉత్పన్నమవుతుందని పలువురు వాపోతున్నారు. సంబంధిత అధికారులు బస్టాండ్ ఆవరణను పూర్తిగా సిమెంట్ గచ్చు చేసి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి



ఈదులూరులో కాటమయ్య వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

- ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): దేవాలయాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని ఈదులూరు గ్రామంలో శనివారం నిర్వహించిన కాటమయ్య స్వామి బోనాల వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు.

ఆలయాలతో ఆధ్యాత్మికత పరిఢవిల్లుతుందని అన్నారు. ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, గ్రామాల్లో ప్రజలు శాంతి, సామరస్యంతో మెలగాలని సూచించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని శాలువాతో సన్మానించారు. ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు యాదగిరి, మాజీ సర్పంచ్ అయితగోని నారాయణ, మాజీ జడ్పీటీసీలు సుంకబోయిన నర్సింహ, మాద యాదగిరి, నాయకులు రెడ్డిపల్లి సాగర్, చెనగోని సాయిలు తదితరులు పాల్గొన్నారు.

'గురుకుల'కు ఫ్యాన్లు,ట్యూబ్‌లైట్ల అందజేత

మునుగోడు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మునుగోడు మహాత్మా జ్యోతిబాపులే బాలికల గురుకుల పాఠశాల విద్యార్థుల శ్రేయస్సు కోసం యుజవన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి తన సొంత ఖర్చులతో రూ.40వేల విలువైన సీలింగ్ ఫ్యాన్లు, ఎల్ఈడీ ట్యూబ్‌లైట్లు, చార్జింగ్ లైట్లను శనివారం బహూకరించారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సతీమణి, సుశీలమ్మ ఫౌండేషన్ చైర్మన్ కోమటిరెడ్డి లక్ష్మి జన్మదినం, యువజన కాంగ్రెస్ 65వ ఆవిర్భావ దినోత్సవంతో పాటు తన సోదరి ప్రశాంతి పుట్టిన రోజును పురస్కరించుకొని గురుకుల పాఠశాల విద్యార్థినులకు బహుమతిగా అందజేసినట్లు తెలిపారు.

తమ పాఠశాలకు సామగ్రిని అందజేసిన మేకల ప్రమోద్‌రెడ్డికి విద్యార్థినులు రాఖీ కట్టి ఆశీర్వచనం చేసి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా స్థానిక బీఆర్ అంబేడ్కర్ చౌరస్తాలో కోమటిరెడ్డి లక్ష్మి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పలువురికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి సంబురాలు చేశారు. వేర్వేరు కార్యక్రమాల్లో యువజన కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గురుకుల పాఠశాలకు ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు బహూకరిస్తున్న యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ప్రమోద్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి



యూత్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరిస్తున్న బొల్లికొండ గణేష్‌యాదవ్

శాలిగౌరారం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లికొండ గణేష్‌యాదవ్ అన్నారు. యూత్ కాంగ్రెస్ 65వ ఆవిర్భావ దినోత్సవాన్ని శాలిగౌరారం మండల కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్‌యాదవ్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు క్రియాశీలక పాత్ర పోషించాలని అన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిశలు పని చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పోల్దాస్ నరేష్, పార్టీ జిల్లా కార్యదర్శి గూని వెంకటయ్య, పార్టీ నాయకులు చింత ధనుంజయ్య, పెరుమాండ్ల నరేష్, షేక్ ఇబ్రహీం, మొగుల్ల శ్రీను, నూక కిషోర్ యాదవ్, పెండెల వినయ్, వేముల భరత్, కుంభం సందీప్, బొల్లికొండ సందీప్, కర్రె నరేష్, సతీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో రాఖీ వేడుకలు



ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి రాఖీ కడుతున్న సోదరీమణులు

నల్లగొండ కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) :అక్కా, తమ్ముడు, అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి వేడుకలు శనివారం ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకున్నారు. ఇళ్లల్లో రాఖీ పండుగను ఆత్మీయత, అనురాగంతో నిర్వహించుకున్నారు. చెల్లెళ్లు అన్నయ్యలకు, అక్కలు తమ్ముళ్లకు రాఖీలను కట్టి ఆప్యాయత, ఆత్మీయత, అనురాగాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా మిఠాయిలను ఒకరికొకరు తినిపించుకున్నారు. పలు దేవాలయాల్లో రాఖీ పౌర్ణమి వేడుకలు జరిగాయి. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి నివాసంలో ఆయన కుటుంబ సభ్యులతో కలిసి రక్షాబంధన్ వేడుకలను జరుపుకున్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డికి ఆయన సోదరిమణులు రాఖీ కట్టి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్ రెడ్డికి తన నివాసంలో వారి సోదరీలు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని ప్రధాన కూడళ్ల స్వీట్‌షాపులు, బేకరిలు సందడిగా మారాయి.

శాలిగౌరారం, చిట్యాల, చిట్యాల రూరల్, నకిరేకల్ : వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న అక్కా చెల్లెళ్లు తమ సోదరుడికి రాఖీ కట్టాలన్నా సోదర ప్రేమతో తరలి వచ్చి రాఖీలు కట్టడం సందడిగా మారింది. అన్ని గ్రామాల్లో పండుగ కోలాహలం కనిపించింది. మరికొంతమది ఆడపడుచులు పోస్టులో, కొరియర్‌లో రాఖీలను పంపించుకోవడంతో సోదరులు వాటిని కట్టుకుని రాఖీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశానికి మునిసిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజిత రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

కేతేపల్లి: మండలంలోని గ్రామాల్లో మహిళల కోలాహలం కనిపించింది. గ్రామాల్లోని వస్త్ర, కిరాణా దుకాణాలు మహిళలతో కిటకిటలాడాయి. మండలానికి చెందిన కాంగ్రెస్ మహిళా విభాగం నాయకులు ఎమ్మెల్యే వేముల వీరేశానికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. రాఖీలు కట్టిన వారిలో మార్కెట్ ఛైర్‌పర్సన్ గుత్తా మంజుల, మాజీ ఎంపీటీసీలు మట్టి సునీత, లక్ష్మి, మాజీ సర్పంచ్ జె.ముత్తమ్మ, మహిళా కాంగ్రెస్ నాయకురాలు ఆవుల నిర్మల తదితరులు ఉన్నారు.



రాఖీ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కుంటుంబసభ్యులు

మునుగోడు: ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆయన అక్కలు సరోజిని, లక్ష్మమ్మ, పూలమ్మ, హేమలతలు రాఖీ కట్టి ప్రేమానురాగాలను పంచుకున్నారు. ఈసందర్భంగా రాఖీ శుభాకాంక్షలు తెలిపారు.

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి పట్టణంలోని ప్రసన్న ఆంజనేయ దేవస్థానంలో సామూహిక రక్షాబంధన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 400 మంది భక్తులకు అర్చకుడు జానకీరామ శర్మ రక్షాబంధనం గావించారు. ఆలయ భక్తమండలి సభ్యులు పసునూరి శ్రీనివాస్, దయాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

- మండలంలోని పల్లెపహాడ్‌లో తొంభై ఆరేళ్ల కల్మెకొలను అండమ్మ తన తమ్ముడు గుంటకండ్ల రామచంద్రారెడ్డికి రాఖీ కట్టారు. రామచంద్రారెడ్డికి మరో సోదరి కట్టారు. వసంత రాఖీ కట్టారు. రామచంద్రారెడ్డి తనయుడు మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డికి తన సోదరి కట్టా రేణుక రాఖీ కట్టగా జగదీష్‌రెడ్డి తనయుడు వేమన్‌రెడ్డికి సోదరి లహరి రాఖీ కట్టారు.



ఎమ్మెల్యేకు రాఖీ కడుతున్న మునిసిపల్ ఛైర్ పర్సన్ రజిత

- క్లీన్ హోం గ్రీన్ హోం ప్రోగ్రాం ఆర్గనైజర్ ఆదిమల్ల మణిరాజు ఆధ్వర్యంలో శనివారం రక్షబంధన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ లింగోటం గ్రామంలో విద్యార్థులల్లో సోదర భావం, స్నేహభావం, జాతీయభావం పెంపొందించడం కోసం రక్షబంధన్ నిర్వహించారు. చెట్లకు రాఖీ కట్టి ఓరుగంటి భవ్య పర్యావరణంపై తమ బాధ్యతను గుర్తు చేశారు.



రాఖీ సంబరాల్లో పాల్గొన్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



శాలిగౌరారంలో రాఖీ వేడుకలు



చెట్టుకు రాఖీ కడుతున్న విద్యార్థిని



నల్లగొండలో రాఖీ వేడుకల్లో పాల్గొన్న యువత



బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కిషన్ రెడ్డికి రాఖీ కడుతున్న సోదరీమణులు



నేరడలో యజ్ఞోపవీతంను ధరిస్తున్న చేనేత సహకార సంఘం సభ్యులు

ఘనంగా జంధ్యాల పౌర్ణమి వేడుకలు


కట్టంగూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కట్టంగూరు గ్రామపంచాయతీ పరిధిలోని పద్మశాలి కాలనీలో జంధ్యాల పౌర్ణమి(నూలు పుట్టిన రోజు) సందర్భంగా శనివారం గాయత్రి హోమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి కులస్తులు అందరూ పాల్గొని నూతన జంధ్యా దారణ చేసుకున్నారు. కార్యక్రమంలో పూజారి శ్రీనివాస్ శర్మ, పద్మశాలి సంఘం నాయకులు గోశిక అంజన్ కుమార్, గంజి గంగయ్య, దీకొండ వెంకన్న, నల్ల పాండరి, కదారి మల్లికార్జున్, రాపోలు మల్లయ్య, గంజి వెంకటేశం, ఉమాపతి, శాంతికుమార్, శంకరయ్య, గోవర్ధన్, పుల్లయ్య, యాదగిరి, మాణిక్యం, అయోధ్య, సత్తీష్, వెంకటేష్ ఉన్నారు.

- చిట్యాలరూరల్ : మండలంలోని నేరడ గ్రామంలో శనివారం పద్మశాలీలు గాయత్రీధారణ మహోత్సవాన్ని స్థానిక సీతారామాంజనేయస్వామి ఆలయంలో(యజ్ఞోపవీతధారణ) నిర్వహించారు. పద్మశాలి పోగు రోజు, జంధ్యాల పౌర్ణమి అని కూడా పద్మశాలీలు పిలుచుకుంటారు. ఈ సందర్భంగా పురోహితుడు పాండురంగాచార్యులు మాట్లాడుతూ గాయత్రీని ధరించడం పవిత్రంగా భావిస్తారని యజ్ఞోపవీతంను గాయత్రీధారణ అని కూడా పిలువబడునని తెలిపారు.
- చిట్యాల: పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో చిట్యాల శివాలయంలో సామూహిక గాయత్రీధారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు జెల్లా మనోహర్, గంజి వెంకటేశం, చేపూరి శ్రీనివాస్, కుకుడాల గోవర్ధన్, గంజి కృష్ణయ్య, మిర్యాల ప్రకాశ్ పాల్గొన్నారు.
- నార్కట్‌పల్లి: మండలంలోని అమ్మనబోలు, నెమ్మాని, బీ.వెల్లెంల గ్రామాల్లో పద్మశాలీ సంఘం నేతలు జంధ్యాల పూర్ణమి ప్రత్యేక పూజలు ఆచరించారు. కొత్త జంధ్యాలను గాయత్రీ మంత్రోపాసనతో ధరించారు.



కట్టంగూరులో నిర్వహించిన మహాయజ్ఞంలో పాల్గొన్న పద్మశాలీలు

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.5
కనిష్ఠం 22.4
***
నల్లగొండ
5
ఆదివారం 10 ఆగస్టు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.70 (311.1486)	44,647	44,647
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.10 (4.02)	4,360	9,918
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.3237 (41.7627)	51,409	51,409

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.220



బీసీ కోటా పెరగడం పక్కా!

స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబరు నెలాఖరులోగా పూర్తిచేసే ఉద్దేశంతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో స్పష్టతకు వస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. అధికారికంగా 42శాతం బీసీ రిజర్వేషన్లకు ఆమోద ముద్ర లభించకపోవడంతో పార్టీపరంగా ఆ వర్గాలకు సీట్లు కేటాయించేలా అధికార కాంగ్రెస్ యోచిస్తోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

» రిజర్వేషన్లు అధికారికమా? పార్టీపరమా? » కొనసాగుతున్న ఉత్కంఠ » కాంగ్రెస్ నుంచి 42శాతం ఇస్తామంటున్న నేతలు

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఆర్డినెన్స్‌కు రాష్ట్రపతి ఆమోదముద్ర లభించకపోగా, అందు కోసం చేసిన ప్రయత్నాలు సఫలీకృతం కాలేదు. దీంతో పార్టీపరంగా 42శాతం బీసీలకు టికెట్లు ఇచ్చి తీరుతామని సీఎం రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలు ప్రకటిస్తున్నారు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు గత రిజర్వేషన్ 23శాతం కొనసాగిస్తూ, మిగిలిన 19శాతం మేర, లేదా అంతకుమించి జనరల్ స్థానాల్లో బీసీ అభ్యర్థులను నెలబెట్టాలనేది కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తుండగా, ప్రతిపక్షాల వ్యూహం తేలాల్సి ఉంది. చివరిసారిగా 2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ పదవుల్లో బీసీలు జనరల్ స్థానాల్లోనూ గణనీయంగా గెలుపొందారు. అయితే జడ్పీపీఠాలు మాత్రం జనరల్ కోటాలో దక్కించుకోలేకపోయారు. ఇప్పుడు సైతం ఎంపీపీ, జడ్పీ చైర్మన్ పదవులకు కూడా జనరల్ స్థానాల్లో బీసీలకు అవకాశమిచ్చేలా టిక్కెట్లు ఇస్తేనే ఆ వర్గానికి తగిన స్థానం దక్కుతుందని బీసీ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.

అధికార, ప్రతిపక్షాలు చిత్తశుద్ధితో వ్యవహరిస్తేనే

స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబరులో నిర్వహిస్తారని భావిస్తుండగా, పంచాయతీ, పరిషత్ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో బీసీ అభ్యర్థులకు అవకాశమివ్వాలని బీసీ సంఘాల నాయకులు కోరుతున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు చిత్తశుద్ధితో వ్యవహరిస్తేనే బీసీలకు ఆయా సీట్లు దక్కుతాయని, లేదంటే రాజకీయక్రీడగా సీట్ల కేటాయింపు కొనసాగితే జనరల్ స్థానాల్లో సీట్ల కేటాయింపు కంటితుడుపు చర్యగా మిగులుతుందని బీసీ సంఘాలనాయకులు అభిప్రాయపడుతున్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాల్లో అధికార పార్టీ ఏ జనరల్ స్థానంలో బీసీలకు టికెట్ కేటాయిస్తే, ప్రతిపక్షాలు సైతం అవే స్థానాల్లో టికెట్లు ఇస్తేనే అంతిమంగా బీసీల ప్రాతినిధ్యం పెరుగుతుందంటున్నారు. అలా కాకుండా గెలుపు లక్ష్యంగానో, లేక స్థానిక పరిస్థితుల పేరుతో ఒక పార్టీ బీసీ అభ్యర్థిని నిలబెట్టిన చోట, మరో పార్టీ జనరల్ అభ్యర్థిని లేదా, ఇతర బలమైన ఓటు బ్యాంకు ఉన్న సామాజికవర్గాలకు టికెట్ ఇస్తే అలాంటి చోట్ల బీసీ అభ్యర్థులు గెలుపును అందుకోలేని పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు. అధికార, ప్రతిపక్షాలకు బీసీలకు అవకాశాలు పెంచాలనే చిత్తశుద్ధి ఉంటే జనరల్ సీట్లలో బీసీలకు ఇచ్చే సీట్లలో అన్ని పార్టీలు ఆ వర్గాలకే టికెట్ ఇవ్వాలనే డిమాండ్ సంఘాల నుంచి వస్తోంది.

గత ఎన్నికల్లో జనరల్ సీట్లలోనూ భారీ గెలుపు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2019లో జరిగిన పంచాయతీరాజ్ ఎన్నికల్లో అధికారికంగా 23శాతం రిజర్వేషన్ ఉండగా, అధికారిక రిజర్వేషన్ కోటా దాటి జనరల్ స్థానాల్లోనూ బీసీ అభ్యర్థులు విజయఢంకా మోగించారు

మిగతా 6వ పేజీలో...

	నల్లగొండ	సూర్యాపేట	యాదాద్రి	మొత్తం
పంచాయతీల్లో గెలుపొందిన బీసీలు ఇలా..				
పంచాయతీల సంఖ్య	835	475	420	1730
బీసీ రిజర్వ్‌డ్ స్థానాలు	209	171	117	497
జనరల్‌లో గెలిచిన బీసీలు	79	52	59	190
మొత్తం బీసీలు గెలిచినవి	288	223	176	687
ఎంపీటీసీ స్థానాల్లో గెలుపొందిన బీసీలు ఇలా..				
ఎంపీటీసీ స్థానాలు	346	255	117	718
బీసీ రిజర్వ్‌డ్ స్థానాలు	93	29	39	161
జనరల్‌లో గెలిచిన బీసీలు	28	50	12	90
మొత్తం బీసీలు గెలిచినవి	121	79	51	251
జడ్పీటీసీ స్థానాల్లో గెలుపొందిన బీసీలు ఇలా..				
జడ్పీటీసీ స్థానాలు	31	23	17	71
బీసీ రిజర్వ్‌డ్ స్థానాలు	4	3	4	11
జనరల్‌లో గెలిచిన బీసీలు	4	2	1	7
మొత్తం బీసీలు గెలిచినవి	8	5	5	18



రైతు బీమాకు వేళాయే

» 14 నుంచి రెన్యూవల్ » కొత్తవారు 13లోగా దరఖాస్తుకు అవకాశం » మార్గదర్శకాలు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

రైతు కుటుంబాలకు భీమా కల్పించేందుకు ప్రభుత్వం రైతు బీమాను అమలుచేస్తోంది. ఈనెల 13వ తేదీన రైతు బీమా పథకం ముగుస్తున్న నేపథ్యంలో 14 నుంచి బీమా పథకాన్ని రెన్యూవల్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. కొత్త పాస్ పుస్తకం పొందిన రైతులు ఈనెల 13లోగా దరఖాస్తు చేసుకోవాలి. గతంలో ఈ పథకం పరిధిలో ఉన్నవారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. గతంలో ఈ స్కీంలో ఉన్న వారందరి డేటాను యథవాధిగా పునరుద్ధరించనున్నారు. ఈ పథకం కింద పేరు నమోదైన రైతు ఏ కారణంతో మృతి చెందినా అతడి నామినీకి రూ.5లక్షలను 10రోజుల్లోనే బీమా కంపెనీలు అందజేస్తాయి.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)

గత ప్రభుత్వంతో పాటు ప్రస్తుత ప్రభుత్వంలో ఎనిమిదో సారి ఈ పథకం అమలుకానుంది. 18 నుంచి 59 ఏళ్ల వయసు ఉన్న రైతులు దరఖాస్తులు చేసుకోవాలి. పుట్టిన తేదీని కచ్చితంగా ఆధార్ ప్రకారం నమోదు చేయాలి. గత సంవత్సరంలో రైతుబీమా నమోదు చేసుకున్న రైతులు వారి నామినీ ఏదైనా కారణంతో మృతిచెందినా కొత్త నామినీలను నమోదుచేసే అవకాశం ఉంటుంది. కొత్త నామినీ ఆధార్‌తో పాటు బ్యాంకు వివరాలను వ్యవసాయ అధికారులకు అందించాలి.

ఉమ్మడి జిల్లాలో 5.70లక్షల మందికి బీమా

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే సుమారు 5,70,825మందికి పైగా రైతులకు రైతుబీమా పథకం అమలవుతోంది. ఈ పథకంలో పేరు నమోదుచేసుకున్న రైతులు దురదృష్టవశాత్తు మృతిచెందితే వారి కుటుంబం వీధిన పడకుండా ఉండేదుకు ఈ పథకం దోహదపడనుంది. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఈ పథకంలో నల్లగొండ జిల్లాలో 2,85, 828మంది రైతులు ఉండగా, సూర్యాపేట జిల్లాలో 1.60లక్షలు, యాదాద్రి జిల్లాలో 1.25 లక్షల మంది నమోదై ఉన్నారు. కొత్తగా పాస్ పుస్తకాలు పొందిన రైతులు నల్లగొండ జిల్లాలో 20,243ఉండగా, సూర్యాపేట జిల్లాలో 12 వేలకు పైచిలుకు, యాదాద్రి జిల్లాలో

- మిగతా 6వ పేజీలో...

నేడు మళ్లీ తెరుచుకోనున్న సాగర్ గేట్లు

● ఈ ఏడాది రెండోసారి ● 589.70 అడుగుల వద్ద నీటిమట్టం

● మూసీ ఐదు గేట్ల నుంచి కొనసాగుతున్న నీటి విడుదల 7



నిండుకుండలా ఉన్న సాగర్ జలాశయం

పెరిగిన బస్ టికెట్ ధరలు

లబోదిబోమంటున్న ప్రయాణికులు

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం సందర్భంగా ఉద్యోగులకు చాలెంజ్ విసిరిన ఆర్టీసీ, రాఖీ పండుగకు ప్రయాణికులపై భారం మోపింది. రాత్రికి రాత్రే బస్ టికెట్ ధరలను పెంచేసింది. మిర్యాలగూడ నుంచి సాధారణ రోజుల్లో డీలక్స్ బస్ టికెట్ ధర రూ.290 ఉండగా, రాఖీ స్పెషల్ టికెట్ ధరను రూ.430కి పెంచింది.

ప్రయాణికులపై ఆర్థికభారం

పండుగ సీజన్లు, ప్రత్యేక కార్యక్రమాల సమయంలో భారం మోపడం ఆర్టీసీకి పరిపాటిగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. పండుగల వేళ అదనపు బస్సులు, ప్రత్యేక ఆఫర్లు ఇవ్వాల్సిన ప్రభుత్వరంగ సంస్థ అదునుచూసి అదరగొట్టడమనే విధంగా చార్జీలు పెంచడం సరికాదంటున్నాయి ప్రజాసంఘాలు. మహిళలకు మహాలక్ష్మీ పథకం ద్వారా ఉచిత రవాణా కల్పిస్తూ, వృద్ధులకు రాయితీ అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించిన ఆర్టీసీ, రాఖీ పండుగ సందర్భంగా 50శాతం చార్జీలు పెంచడం తగదంటున్నారు.



మిర్యాలగూడ - హైదరాబాద్ టికెట్

ఉన్నతాధికారుల ఆదేశాలంటూ..

ప్రజారవాణా సంస్థయిన ఆర్టీసీ సంస్థ అధికారులు, ఉద్యోగులకు స్పష్టమైన లక్ష్యం ఇస్తోంది. ఈ పండుగకు ఇంత వసూలు చేయాలి, ఇంత కలెక్షన్ రావాలంటూ 'ప్రైవేటు' సంస్థలా హుకూం జారీ చేస్తోందని ఉద్యోగులు వాపోతున్నారు. సాధారణ, అద్దె బస్సులకు స్పెషల్ సర్వీసు లంటూ, మహాలక్ష్మీ పథకం వర్తించదంటూ స్టిక్కర్లు వేస్తున్నారు. అమాంతం పెంచిన అదనపు చార్జీలను వసూలు చేస్తూ పండుగ పూట ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్నారని నెటిజన్ల పోస్టులు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

ప్రతీ పండుగకు పెంచడం సరికాదు



దసరా, సంక్రాంతి పండుగల సందర్భంగా టికెట్ ధరలు పెంచడం తెలిసిందే. అలా అని ప్రతీ పండుగకు టికెట్ ధరలు పెంచడం సరికాదు. పరిస్థితి చూస్తుంటే కృష్ణాష్టమి, వినాయక చవితి పండుగలకూ టికెట్ ధర పెంచేలా ఉంది ఆర్టీసీ.

- అజయ్ నేరెళ్ల, మిర్యాలగూడ

ప్రయాణికులను దోచుకోవద్దు



పండుగల పేరుతో ప్రయాణికులను దోచుకోవడం సరికాదు. ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని 30నుంచి 40శాతం టికెట్ ధరలు పెంచి ప్రయాణికుల జేబులు గుల్ల చేస్తున్నారు. ఆదాయ పెంపు కోసం ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలి. ప్రజా రవాణా సేవలు వినియోగించుకునే వారిలో పేద, మధ్యతరగతి వారే అధికంగా ఉంటారు. టికెట్ ధరలు అమాంతంగా పెంచి సామాన్య ప్రజలను ఇబ్బంది పెట్టడం తగదు.

- జాజుల లింగంగౌడ్, బీసీ సంఘ రాష్ట్ర కార్యదర్శి, మిర్యాలగూడ

రైళ్లు ఆగుతున్నాయి

» ఆన్‌లైన్ టికెట్ బుకింగ్‌లో కనిపించని స్టేషన్ల పేర్లు

» గడువు ముగియడంతో ఎత్తేశారనుకుంటున్న ప్రయాణికులు



మిర్యాలగూడ రైల్వే స్టేషన్

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో తీసుకున్న నిర్ణయం రైల్వే ప్రయాణికులపై ప్రభావం చూపుతోంది. వైరస్ వ్యాప్తి చెందకుండా ప్రయాణికులను కట్టడి చేసే క్రమంలో రైల్వేశాఖ తీసుకున్న నిర్ణయంతో దేశవ్యాప్తంగా పలు స్టేషన్లలో రైళ్ల హాల్ట్‌లను ఎత్తేశారు. అందులో భాగంగా పలు రైళ్లకు మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల స్టేషన్లలో హాల్ట్‌లను తొలగించారు. అయితే ప్రయాణికుల ఆందోళన, ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు ఆయా స్టేషన్లలో పరిమిత కాలానికి మాత్రమే స్టాప్‌లను పునరుద్ధరించారు. ఆరు నెలలకోసారి జరుగుతున్న రైళ్ల హాల్ట్‌ల పునరుద్ధరణ ప్రక్రియ జూలై 18వ తేదీ నాటికి పూర్తయింది.

ఆన్‌లైన్‌లో చూపించకపోవడంతో..

నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్, చెన్నై సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లలో ప్రయాణించేందుకు ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకునే క్రమంలో రిటర్న్ జర్నీలో నడికుడి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ స్టేషన్లు కనిపించకపోవడంతో ఆయా స్టేషన్లలో స్టాప్‌లను గతంలో మాదిరిగా ఎత్తివేశారన్న ప్రచారం జరిగింది. విశాఖ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌కు అయితే నడికుడి, పిడుగురాళ్ల, మిర్యాలగూడలతో పాటు నల్లగొండ స్టేషన్ సైతం ఆన్‌లైన్ టికెట్ బుకింగ్‌లో చూపించడం లేదని, గుంటూరు తదుపరి సికింద్రాబాద్(లింగంపల్లి) మాత్రమే చూపుతోందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాకపోకలు యథాతథంగానే..

నల్లగొండ, మిర్యాలగూడ మీదుగా పరుగులేట్టే రైళ్ల రాకపోకల్లో మార్పులేవీ లేవని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు. ప్రతీ ఆరు నెలలకోసారి ప్రయోగాత్మకంగా స్టాపులను ఎత్తేసేలా ఉత్తర్వులు జారీ అయినా, రైళ్ల రాకపోకల్లో ఎటువంటి మార్పులు, చేర్పులు లేవంటున్నారు. ఎక్స్‌పర్మెంటల్ స్టాపేజెస్ ప్రక్రియలో భాగంగా పేర్కొన్న విధంగా టికెట్ బుకింగ్ సైట్‌లో ఆయా స్టేషన్లు కనిపించడం లేదంటున్నారు. నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్, చెన్నై సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో టికెట్ బుక్ చేసుకునే క్రమంలో రిటర్న్ జర్నీలో నడికుడి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ స్టేషన్లు కనిపించకపోగా, విశాఖ ఎక్స్‌ప్రెస్ టికెట్ బుకింగ్ రిజర్వేషన్లలో ఈ మూడు స్టేషన్లతో పాటు నల్లగొండ స్టేషన్ పేరు కనిపించడం లేదన్న ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. విషయాన్ని ఉన్నతాధికారులకు, సాంకేతిక విభాగానికి తెలియజేశామని, ప్రయాణికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రైల్వే అధికారులు తెలిపారు.

అన్ని చెరువులు, కుంటలు నింపుతాం

నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం

కట్టంగూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని చెరువులను, కుంటలను నింపుతామని తద్వారా భూగర్భ జలాలు పెరిగి రైతులు ఆనందగా ఉంటారని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శనివారం మండలంలోని అయిటిపాముల రిజర్వాయర్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అయిటిపాముల రిజర్వాయర్ ద్వారా నీటి విడుదల చేశామని, ఈ నీటితో కేతేపల్లి మండలంలోని కొండకిందిగూడెం, బండపాలెం, ఇనుపాముల, కొర్లపహాడ్‌లతో పాటు నకిరేకల్ మండలంలోని నకిరేకల్, నోముల గ్రామాల్లోని చెరువులు నిండుతాయన్నారు. కాళేశ్వర ప్రాజెక్టును బీఆర్ఎస్ హయాంలోనే కట్టారని, వారి హయాంలోనే కూలిందన్నారు. కాళేశ్వరం ద్వారా ఎన్ని టీఎంసీల నీరు ఎత్తారు? అని ఎన్ని ఎకరాలకు నీరు ఇచ్చారు? అని ఆయన ప్రశ్నించారు. గత పాలకుల తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని విధ్వంసం చేసి అప్పులపాలు చేశారు తప్ప అభివృద్ధి జరగలేదన్నారు. రైతుల కళ్లలో ఆనందం చూడటమే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, మాజీ జడ్పీటీసీలు మాద యాదగిరి, సుంకరబోయిన నర్సింహ, నాయకులు నంద్యాల వెంకట్‌రెడ్డి, బెజవాడ సైదులు, ఎడ్ల పెద్దరాములు, రెడ్డిపల్లి సాగర్, చెనగోని సాయిలు, కొండయ్య, మర్రి రాజు, మిట్టపల్లి శివ, చెనగోని రవి, తదితరులు ఉన్నారు.



అయిటిపాముల రిజర్వాయర్ వద్ద గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

విద్యాసంస్థల్లో సైకాలజిస్ట్‌లను నియమించాలి

మిర్యాలగూడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యాసంస్థలన్నింటిలో సైకాలజిస్టులను నియమించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు కోరారు. శనివారం ఈ మేరకు ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల పాఠశాల స్థాయి నుంచే మానసిక ఒత్తిడి, ఆందోళనలకు గురవుతున్న విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. అలాంటి వాతావారణం నుంచి విద్యార్థులను బయటపడవేసి సానుకూల దృక్పథాన్ని కలిగించి భవిష్యత్‌పై ఆశలు పెంచే విధంగా సైకాలజిస్టులను విద్యాసంస్థల్లో నియమించాలని కోరారు. సరైన సమయంలో విద్యార్థులకు, యువతకు కౌన్సిలింగ్ ఇవ్వడం వల్ల సమగ్రమైన మానసిక, నైతిక సామాజిక ప్రవర్తనలో మార్పులు తీసుకురావచ్చునని అన్నారు. విద్యాసంస్థల్లో విధిగా సైకాలజిస్టులను నియామకం చేయాలని ఇటీవల సుప్రీంకోర్టు కూడా తీర్పునిచ్చిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని నియామకాలు చేపట్టేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఎమ్మెల్సీకి అందజేసిన వినతిపత్రంలో కోరినట్లు చెప్పారు. వినతిపత్రం అందజేసిన వారిలో సైకాలజిస్ట్ కర్నం లింగయ్య, తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న సైకాలజిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

బూత్ స్థాయి నుంచే కాంగ్రెస్‌ను పటిష్టం చేయాలి



యువజన కాంగ్రెస్ జెండాను ఆవిష్కరిస్తున్న గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బూత్ స్థాయి నుంచే యువజన కాంగ్రెస్‌ను పటిష్టం చేయాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి అన్నారు. యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువజన కాంగ్రెస్ కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. క్రమ శిక్షణతో పని చేసే వారికి మంచి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యకర్తలు ఎదగడానికి యువజన కాంగ్రెస్ పునాది లాంటిదని అన్నారు. చిత్తశుద్ధితో పనిచేసే వారికి పార్టీ పరంగా పదవులు వరిస్తాయని, పార్టీ ఏ కార్యక్రమం ఇచ్చినా యువజన కాంగ్రెస్ క్రియాశీలక పాత్ర పోషించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నల్లగొండ నియోజకవర్గ అధ్యక్షుడు మామిడి కార్తీక్, నాయకులు కత్తుల కోటి, జహంగీర్, నారాజు, సతీష్, ఆనంద్‌రెడ్డి, నవీన్, అనిల్, సిద్దార్థ, రంజిత్, జానీ, సురేష్, అజారుద్దీన్, ముజ్జు, విజయ్, పరుశరాం, వసీం, వినయ్, హలీం, బిలాల్, జానకీరామ్, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి

నల్లగొండ కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రావాల్సిన పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని రాష్ట ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని పెన్షనర్ల భవనంలో జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్లకు రావాల్సిన ఐదు డీఏలను వెంటనే విడుదల చేసి, ఈహెచ్‌ఎస్ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈనెల 11న ఉదయం 11 గంటలకు హైదరాబాద్ మెడ్‌విజన్ కంటి ఆస్పత్రి సహకారంతో పెన్షనర్స్ భవనంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నామన్నారు. దీన్ని పెన్షనర్స్ కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ చేస్తారన్నారు. అనంతరం 30 మంది పెన్షనర్ల జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్, నాయకులు జెల్లా శ్రీశైలం, రామలింగం, గోపాల్‌రెడ్డి, రవి ప్రసాద్‌రావ్, కేశవాచారి, మహేశ్వరి, భిక్షం, ఆంజనేయులు, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మధుమేహ వ్యాధి శిబిరం

నిడమనూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బొడ్రాయి వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు బెలిదె అశోక్, ప్రధాన కార్యదర్శి చిత్రం అశోక్ తెలిపారు. నిడమనూరు, పరిసర ప్రజలు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు శిబిరంలో పాల్గొని పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. శిబిరంలో డాక్టర్ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

ఆంజనేయస్వామి సన్నిధిలో అన్నదానం

నిడమనూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడ్ సమీపంలో కొలువైన శ్రీభక్తాంజనేయస్వామి ఆలయ సన్నిధిలో శనివారం బీజేపీ రాష్ట్ర నాయకుడు మన్నెం రంజిత్‌యాదవ్ జన్మదినోత్సవం సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. రంజిత్ యువసేన అధ్యక్షుడు కుంటిగొర్ల రాజశేఖర్ ప్రారంభించిన ఈ కార్యక్రమంలో నాయకులు అర్వ అశోక్‌యాదవ్, కడియం సైదులు, ఎదుళ్ల విసీల్‌రెడ్డి, శ్రవణ్, అనిల్, సతీష్‌గౌడ్, క్రాంతి, శ్రీను, నవీన్, మురళి, మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పండుగ

● వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు ● శుభాకాంక్షలు తెలుపుకున్న అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్లు



ఎమ్మెల్యే బాలునాయక్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి గౌతమి



ఎమ్మెల్యే జైవీర్‌కు రాఖీ కడుతున్న యువతి



మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌కు రాఖీ కడుతున్న ఆయన సోదరి

దేవరకొండ, చింతపల్లి, నాగార్జునసాగర్, మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): దేవరకొండలో రాఖీ పండగ వేడుకలను శనివారం ఘ నంగా నిర్వహించారు. రక్షాబంధన్ ప్రేమానురాగాలకు ప్రతీక అని ఎమ్మె ల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. రాఖీ పండగను పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ కొర్ర గౌతమి రాంసింగ్ ఎమ్మెల్యేకు రాఖీ కట్టారు. మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌కు ఆయన సో దరిమణులు రాఖీలు కట్టగా శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పండగ కావడంతో దేవరకొండలో సందడి వాతావరణం నెలకొంది. అక్కాచెల్లెళ్లు, అ న్నాదమ్ముళ్లకు రాఖీలు కట్టేందుకు వివిధ ప్రాంతాల నుంచి చేరుకొని రా ఖీలు కట్టారు.



పీటీనగర్‌లో సోదరులకు రాఖీ కడుతున్న సోదరీమణులు

దేవరకొండ ఆర్టీసీ డిపో హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సుల ను ఏర్పాటు చేసింది. రాఖీ పండగను పురస్కరించుకొని 30కి పైగా అదనపు బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ తల్లాడ రమేష్‌బాబు తెలిపారు. రాఖీ పండుగ కావడంతో పట్టణంతో పాటు గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

● చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్(మాల్), చింతపల్లిలో వయస్సుకు తేడా లేకుండా రాఖీలు కట్టుకొని శుభాకాంక్షలు తెలిపారు. దీంతో ఏ గ్రామంలో చూసిన సందడి నెలకొంది. పట్టణాల నుంచి పల్లెలకు ప్రజలు వస్తుండటంతో సాగర్-హైవే వాహనాలతో కిక్కిరిసిపోయింది.

● నాగార్జునసాగర్‌లో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డికి ఓ యువతి రాఖీ కట్టింది. అలాగే సీఐ శ్రీను నాయక్‌కు అదే పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ రాజేశ్వరి రాఖీ కట్టింది, జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్‌కు ఆయన కుమార్తె రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

● మిర్యాలగూడ పట్టణంలో రాఖీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన మహిళలు తమ సోదరులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘాల నాయకులు జాజుల లింగంగౌడ్, తాళ్లపల్లి సురేష్, చేగొండి మురళి, బంటు వెంకటేశ్వర్లు, మహేష్‌గౌడ్, అశోక్‌నాయక్, సత్యం తదితరులు విద్యార్థినులతో రాఖీలు కట్టించుకుని స్వీట్లు పంపిణీ చేశారు.



నాగార్జునసాగర్‌లో రాఖీలు కడుతున్న చిన్నారులు

కలశయాత్రను విజయవంతం చేయాలి

● యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు ఏడుకొండలు యాదవ్

దేవరకొండ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): అఖిలభారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో చేపట్టిన రేజాంగ్లరడ్ కలశ యాత్రను విజయవంతం చేయాలని యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్ కోరారు. దేవరకొండలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 11వ తేదీన రేజాంగ్లరడ్ కలశయాత్ర నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి నల్లగొండ జిల్లాకు చేరుకుంటుందన్నారు. యాదవ సంఘం నాయకులు, కార్యకర్తలు యాత్రకు భారీగా స్వాగతం పలకాలన్నారు. 1962లో ఇండియా - చైనా మధ్య జరిగిన యుద్ధంలో 120 మంది వరకు యాదవ మిలటరీ జవాన్లు వీరమరణం పొందారని అన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన యాదవ యుద్ధ వీరుల త్యాగాలను గుర్తించాలని ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఈ నెల 12వ తేదీన యాత్ర దేవరకొండకు చేరుకుంటుందని భారీగా స్వాగతం పలికి యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యాదవ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు సుధాకర్‌యాదవ్, లొడంగి గోవర్ధన్‌యాదవ్, నక్క వెంకటేష్‌యాదవ్, మేకల శ్రీనివాస్ యాదవ్, నల్లగాసు విజయ్‌యాదవ్, అబ్బనబోయిన శ్రీనివాస్‌యాదవ్, నేతాళ్ల వెంకటేష్‌యాదవ్, కొంఢ్ర శ్రీశైలంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు



యువజన కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తున్న గడ్డమీది సాయి

డిండి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం యువజన కాంగ్రెస్ ఎన్నో ఉద్యమాలు చేపట్టిందని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డమీది సాయి అన్నారు. యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం డిండి మండల కేంద్రంలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద యూత్ కాంగ్రెస్ జెండాను ఆయన ఎగురవేసి మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం యూత్ కాంగ్రెస్ దేశవ్యాప్తంగా మరిన్ని ఉద్యమాలు చేపడుతుందని తెలిపారు. యువత మత్తుకు బానిసలు కాకుండా సరైన మార్గంలో నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాదమోని శ్రీనివాస్‌గౌడ్, నూకం వెంకటేష్, పోల వెంకటేష్, వంగాల శేఖర్‌రెడ్డి, ఎం.ఎ.కలీం, బూషిపాక సాలయ్య, మల్లేష్, కయూం, ఉమర్, నరేష్, సాలయ్య పాల్గొన్నారు.

ముత్తిరెడ్డికుంటలో వారాహి ఆలయ నిర్మాణం



వారాహి ఆలయ నిర్మాణ భూమి పూజలో అన్నపూర్ణ మాతాజీ

మిర్యాలగూడటౌన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముత్తిరెడ్డి కుంటలో వారాహి ఆలయానికి శనివారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన అన్నపూర్ణ మాతాజీ మాట్లాడుతూ వారాహి ఆలయ నిర్మాణంతో పట్టణానికి మహర్దశ పడుతుందన్నారు. భక్తులను చల్లగా చూసే వారాహి మాత ఆశీస్సులతో వర్షాలు కురవాలని, పంటలు పండాలని ఆకాంక్షించారు. అనంతరం సంతోషిమాత ఆలయంలో అమ్మవారి పుట్టిన రోజు సందర్భంగా చండీహోమం. పంచామృతాభిషేకం నిర్వహించారు. కార్యక్రమాల్లో మాజీ కౌన్సిలర్లు పత్తిపాటి సంజాత, నవాబ్, రామమూర్తి, సీత, మాధవి, చంద్రయ్య, దుర్గయ్య, వెంకటేశ్వర్లు, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు సంప్రదాయ నృత్యాలు, ఆట, పాటలతో బాలునాయక్‌కు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాలునాయక్ మాట్లాడుతూ గిరిపుత్రులు, వనవాసీలు ప్రత్యేకమైన ఆచార, సంస్కృతి, సంప్రదాయాలను కలిగి ఉంటారని అన్నారు. ఆగస్టు 9వ తేదీన ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించుకోవాలని, ఐక్యరాజ్యసమితి 1994లో ప్రకటించిందని తెలిపారు. ఆదివాసీలకు ప్రభుత్వ పథకాలు అమలుచేస్తు గ్రామీణ ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను ఆదివాసీలు సద్వినియోగం చేసుకొని విద్యాపరంగా అభివృద్ధి సాధించాలన్నారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి శత్రునాయక్, అలంపల్లి నర్సింహ, ఎంపీడీవో డానియెల్, కేతావత్ నాగేశ్వర్‌రావు, బిక్కునాయక్, దేవరకొండ తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, గిరిజనసంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే బాలునాయక్‌కు గిరిజన విద్యార్థులు రాఖీ పండగను పురస్కరించుకొని రాఖీలు కట్టారు. వారికి ఎమ్మెల్యే బాలునాయక్ శుభాకాంక్షలు తెలిపారు.



దేవరకొండ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి రాఖీ కడుతున్న మాజీ జడ్పీటీసీ రేణుక

దేవరకొండ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దేవరకొండ మాజీ జడ్పీటీసీ, మహిళ కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు గుంజ రేణుకనారాయణ శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టారు. రాఖీ పండగను పురస్కరించుకొని సీఎంకు కలిసి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపినట్లు ఆమె తెలిపారు. మహిళ సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని సీఎం తెలిపినట్లు ఆమె పేర్కొన్నారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రి సీతక్కతో పాటు మహిళ కాంగ్రెస్ రాష్ట్ర ప్రతినిధులు ఉన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవంతీపురం సంతలో యువతకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్

మిర్యాలగూడ రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ అన్నారు. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ జాతరలు ఉత్సవాలు, వారాంతపు సంతల్లో, రద్దీగా ఉన్న ప్రాంతాల్లో సెలవు రోజుల్లో, ఖాళీ సమయాల్లో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. శనివారం మండలంలోని అవంతీపురం సంతలో ఆయన యువతకు, ప్రజలకు మతు పదార్థాలు, గంజాయి, డ్రగ్స్ వాడటం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మద్యపానం, ధూమపానం, గంజాయి, డ్రగ్స్ వంటివి ఆరోగ్యానికి హానికరమని వివరిస్తూ కరపత్రాలను పంచుతూ మైక్ పట్టుకొని ఫ్లెక్సీతో విచిత్ర వేషధారణతో ప్రచారం నిర్వహించారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

● ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్

మిర్యాలగూడ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నారు. పట్టణంలోని శనివారం స్థానిక విద్యానగర్ కాలనీలో ఎమ్మెల్సీ నివాసంలో సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద రోగులు అత్యవసర సమయాల్లో ఖరీదైన వైద్యసేవలు పొందేందుకు ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థికసాయం అందజేస్తోందని అన్నారు. నిరుపేదలు ప్రభుత్వం పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా 9 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.7లక్షల విలువైన ముఖ్యమంత్రి రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మహబూబ్‌అలీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాకునూరి బసవయ్యగౌడ్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తలకొప్పుల సైదులు, నాయకులు మాలి కాంతారెడ్డి, బక్కారెడ్డి చలపతిరావు, లక్ష్మణ్‌గౌడ్ జవహర్, నెహ్రూ, నాగరాజు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్

తైక్వాండో ఆత్మరక్షణకు తోడ్పడుతుంది



తైక్వాండోలో బెల్ట్‌లు సాధించిన విద్యార్థులు

దామరచర్ల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తైక్వాండోను నేర్చుకోవడం వల్ల వారి ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందని శాంతినికేతన్ పాఠశాల ప్రిన్సిపాల్ లీమా మేరీ, ముఖ్య ఎగ్జామినర్ పట్టెడ సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలోని శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శనివారం తైక్వాండో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో 61 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 33 మంది ఎల్లో, 13 మంది ఎల్లో వన్ బెల్ట్, 8 మంది గ్రీన్‌బెల్ట్, నలుగురు గ్రీన్ వన్ బెల్ట్, ముగ్గురు బ్లూ బెల్ట్‌లను గెలుపొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు తైక్వాండో నేర్చుకోవాలని అన్నారు. దీని వల్ల శారీరక, మానసిక వికాసం కలుగుతుందని, క్రమశిక్షణ, ఆత్మరక్షణతో అలవడుతుందని పేర్కొన్నారు. తైక్వాండో సర్టిఫికెట్లకు స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్ ఉంటుందన్నారు. దీనివల్ల ఉన్నత చదువుకు, ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బొడ్డు వీరస్వామి, దారగాని వెంకటేశ్వర్లు, అన్నెం కరుణాకర్‌రెడ్డి, సందాల సదానందం, షేక్ జానీపాషా, కుందూరు సైదిరెడ్డి, నాగిరెడ్డి, సీతారాంరెడ్డి, యర్రం సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

నిడమనూరు, చింతపల్లి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కొత్తగా పట్టాదారు పాసుపుస్తకం పొందిన రైతులు రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని నిడమనూరు క్లస్టర్ ఏఈవో దండెం విజయచంద్ర, చింతపల్లి మండల వ్యవసాయ అధికారి శ్రావణకుమారి తెలిపారు. 18 నుంచి 59 ఏళ్లలోపు వయస్సు ఉన్న రైతులు ఈ పథకానికి అర్హులని వారు తెలిపారు.

రైతులు దరఖాస్తు ఫారంతో పాటు తమ పట్టాదారు పాసుపుస్తకం జీరాక్స్, ఆధార్ కార్డు జీరాక్స్, నామినీ ఆధార్ కార్డు జీరాక్స్ పత్రాలతో ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల్లోగా మండల వ్యవసాయ కార్యాలయం లేదా సమీప రైతువేదికల్లో సమర్పించాలని ఆయన సూచించారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

వైభవంగా గాయత్రీధారణ మహోత్సవం



డిండి భక్త మార్కండేయస్వామి దేవాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న పద్మశాలీలు

డిండి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): డిండి మండల కేంద్రంలోని భక్త మార్కండేయస్వామి దేవాలయం వద్ద ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు శనివారం పద్మశాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా యజ్ఞోపవితరణం, నూలు పూర్ణిమ, గాయత్రీధారణ వేయడం జరిగింది. పరస్పరం రాఖీలు కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురోహితులు శ్రీనివాస్‌శర్మ, గుర్రం రాములు, గంజి బాలయ్య, బుజ్జిరి సత్యం, పున్న లింగమయ్య, మునగపాటి శ్రీను, రచ్చ ఈశ్వరయ్య, కర్నాటి శ్రీను, పొట్టబత్తిని దుర్గ ప్రసాద్, డాక్టర్ మధు, మార్కండేయ, మాకం సైదులు, పులిజాల రమేష్, గుర్రం సురేష్, పున్న దినేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మపరిరక్షణ కోసం కృషి : చైర్మన్



గొడకొండ్లలో పూజలు చేస్తున్న భక్తులు

చింతపల్లి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణ కోసం అందరూ కృషి చేయాలని గొడకొండ్ల ఆలయ కమిటీ చైర్మన్ అల్వాల జంగయ్యగౌడ్ తెలిపారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని చింతపల్లి మండలంలోని గొడకొండ్ల శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన నాయకుడు కొండూరి పవన్‌కుమార్, మాస భాస్కర్, ఆలయ అర్చకుడు వైద్యుల ప్రవీణ్‌కుమార్‌శర్మ, ధర్మకర్తలు ఇడుకుళ్ల రామోహన్, గ్యార ఉమాయాదయ్య, పాలకూర్ల కృష్ణ, మొగుతాల మహేష్‌గౌడ్, విరమళ్ల శంకర్, వంగూరి శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ : మిర్యాలగూడ: శ్రీనివాస : అతడు /జూనియర్, వెంకటేశ్వర: హరిహర వీరమల్లు / రాఘవ: కింగ్‌డమ్, విక్రోస్: బకాసుర / రెస్టారెంట్, కింగ్‌డమ్, మహావతార్ నరసింహ, దేవరకొండ : మనోజ్ : కింగ్‌డమ్ మైత్రి వెంకటేశ్వర : మహా అవతార్ నర్సింహ